

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :13 సంచిక: 2 హైదరాబాద్ 2013 మే పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# ధర్మశాల 8వ వార్షికోత్సవం

మెహెర్‌స్థాన్ ధర్మశాల 8వ వార్షికోత్సవం 2013 జూలై 28, ఆదివారం ఉదయం 7.30 నుండి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ వై.ఎస్. రావు (98481 11671) ఒక ప్రకటనలో తెలిపారు. మెహెరాబాద్ నుండి శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ తదితరు బాబా ప్రేమికులు విచ్చేస్తున్నారని ఆయనన్నారు. స్థానికంగా గల బాబా ప్రేమికులందరు విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

# మౌన వార్షికోత్సవం

2013 జూలై 10 న బాబా ప్రేమికులు అందరూ మౌనం పాటిస్తారు. జూలై 9 అర్ధరాత్రి నుండి 10వ తేది అర్ధరాత్రి 12 గంటల వరకూ బాబా నామం స్మరిస్తూ మౌనం పాటిస్తారు. మెహెర్‌బాబా 1925 జూలై 10 నుండి 1969 జనవరి 31 వరకూ అంటే ఆయన భౌతిక దేహం వదిలే వరకూ కఠిన మౌనంలోనే వున్నారు. మెహెర్‌బాబా మౌనం చేపట్టిన రోజైన జూలై 10న తన ప్రేమికులందర్నీ మౌనం పాటించమని బాబా కోరారు.

మౌన వార్షికోత్సవం సందర్భంగా స్థానిక బాబా సెంటర్లలో విచ్చేసే ప్రేమికుల కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆయా సెంటర్‌ల కార్య నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లోని కోఠి సెంటర్, జూబ్లి బాబా సెంటర్‌లలో కూడా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బాబా ప్రేమికులు కానప్పటికీ జూలై 10న మౌనం పాటించాలనుకోవడం ముదావహం.

### మెహెరాబాద్

కాగా, గత కొన్ని సంవత్సరాలుగా మెహెరాబాద్‌లో బాబా సమక్షంలో మౌనం పాటించాలన్న ఉద్దేశ్యంతో చాలామంది ప్రేమికులు మెహెరాబాద్ వెళుతున్నారు. అలా వెళ్తున్న బాబా ప్రేమికులందరికీ ఆంధ్రా గెస్టు హౌసు స్వాగతం పలుకుతోందని, కార్యదర్శి శ్రీ వై.యస్. రావు ఒక ప్రకటనలో తెలిపారు. జీవిత సభ్యులు, వృద్ధులు, అనారోగ్యంతో వున్నవారికి అతిధి గృహంలో వసతి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వనున్నామని శ్రీ రావు తెలిపారు. వృద్ధుల సౌకర్యార్థం రెస్టు హౌసు నుండి బాబా సమాధి దాకా ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేశామని, జూలై 10 నాడు ప్రతి పది నిముషాలకు ఈ సౌకర్యం లభిస్తుందని శ్రీ రావు తెలిపారు. రెస్టు హౌసులో వసతి కోరువారు తమ విజ్ఞప్తిని త్వరలో పంపవల్సిందిగా ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## బాబా సందేశం

ఈ ప్రపంచం ఏ మాత్రం విలువలేనిదని నీవు గ్రహించేవరకూ
నీవు నన్ను దర్శించలేవు.

Until you see the world as worthless,
You can not see Me.

**- MEHER BABA**


**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


## లోపలి పేజీలలో...


1. సంపాదకీయం 5
2. మెహెర్‌బాబాతో డాక్టర్ సుభోద్ చంద్రరాయ్ 6-9
3. ..... సాటి మరొకరు లేరు 10-12
4. ఘనీ రాసిన వ్యాసం **"అవతార్"** 13-16
5. బాధలతో విసిగిపోతున్నారా? 17-19
6. లార్డ్ మెహెర్ 20-31
7. అవతారుని దివ్యధామం 32-33
8. ఆనతి... నీయరా! 34-37
9. ఆధ్యాత్మిక అవగాహనా తరగతులు 38
10. ప్రార్ధనలు


### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

## ఆంధ్రుల అతిథి గృహం

# జలనిధి

నేడు మెహెరాబాద్‌లోని ఆంధ్రా రెస్ట్‌హౌస్‌లో ఏకకాలంలో 450 మందికి పైగా బస చేయొచ్చు. కేవలం నూరు మందికి వసతి కల్పించేలా 2009 మార్చిలో ఆంధ్రా రెస్టుహౌసు ప్రారంభించారు. ఎందరో బాబా ప్రేమికులు అందించిన ఆర్థిక సహాయం ద్వారా అనతి కాలంలోనే అతిథిగృహం అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. బాబా ప్రేమికులకు ఏడాది పొడుగూతా రాత్రనక పగలనక, అర్ధరాత్రి తలుపు తట్టినా అతిథి గృహం సాదరంగా స్వాగతం పలుకుతోంది. ఏప్రిల్, మే నెలలో మండుటెండా కాలంలో సయితం ఆశేతు హిమాచలం నుండి విచ్చేసే బాబా భక్తులందరికీ ఆంధ్రా అతిథి గృహం ప్రేమతో విశేష సేవలందిస్తోందన్న కీర్తి మూటకట్టుకుంది.

రెస్ట్‌హౌస్ ప్రారంభం నుండీ 2012 జూన్ 6 వరకు అవతార్ మెహెర్‌బాబా ట్రస్టు, అహ్మద్‌నగర్‌వారు ఉచితంగా మంచినీటి సౌకర్యం అందించారు. కానీ అనివార్య కారణాల వల్ల ఆ దరిమిలా వారు ఆ సౌకర్యాన్ని పూర్తిగా నిలుపుదల చేస్తున్నామని ప్రకటించారు. ఇది విచారకరం. నదులూ, వాగులూ లేని ఈ ప్రాంతంలో ఎండలు ఎక్కువ, వానలు తక్కువ. ఇక్కడ ప్రతి ఏడాది దుర్భిక్ష పరిస్థితులే నెలకొని వుంటాయని బాబా ప్రేమికులందరికీ తెలుసు. ఏది ఏమైనప్పటికీ కొద్దిపాటిగా వున్న స్థానిక బోరు నీటిని ఉపయోగిస్తూ, విచ్చేసే బాబా ప్రేమికులందరి కోసం గత ఏడాదిగా మంచినీటి ట్యాంకర్లు ద్వారా నీటిని కొనుగోలు చేసి తగిన నీటి సరఫరా జరుపుతున్నారు!!

ఈ విషయంలో బస చేసిన భక్తులెవరికీ ఎలాంటి అసౌకర్యం కల్గించకుండా అతిథిగృహం యాజమాన్యం తమ శాయశక్తులా కృషిచేస్తోంది! ఐతే, ట్యాంకర్లు ద్వారా నీటి కొనుగోలు– సరఫరా పరిస్థితి రాబోయే రోజుల్లోనూ కొనసాగించాల్సిన పరిస్థితి వుంది. ఇక్కడ నీటి సమస్య శాశ్వతంగా వుంటుందిగాన, ట్యాంకర్ల ద్వారా మంచినీటి కొనగోలు ఇకపై కూడా తప్పనిసరి అని గత ఏడాదిగా మన అనుభవం తెలియజేస్తోంది. అందుకోసమని ట్యాంకర్ల ద్వారా నీటి కొనుగోలుకయ్యే ఖర్చును భరించడానికి గాను శాశ్వత ప్రాతిపదికన ఒక జలనిధిని ఏర్పాటుచేయాలని ప్రతిపాదించడమైంది. ఆర్థికస్తోమత గల బాబా ప్రేమికులందరూ ఈ జల నిధికి ఆర్థిక సహాయం అందజేయవల్సిందిగా **కార్యదర్శి శ్రీ వై.ఎస్. రావు.** కోరుతున్నారు. ఇదొక్కటే ఈ సమస్యకు తాత్కాలిక ఉపశమనమని భావించడమైందని ఆయన అన్నారు. మరిన్ని వివరాలకు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఫోన్ 09011751910, 09848111671, ఇ-మెయిల్. andhraresthouse7@gmail.com, సంప్రదించగలరు.

సంపాదకీయం

# సదాస్మరణీయం

“పాడనా ప్రభూ! పాడనా!
నా గానముతో నీదు మనస్సు కరుగునా...”, అంటూ దశిక ప్రసాదరావు గారు మెహెర్‌బాబా పత్రికని స్థాపించి పుష్కరమైంది ఈ సంచికతో.
**మీ ఉద్దేశ్యం మంచిదయితే, నేను వుంటాను మీ వెంట అన్న మెహెర్ ప్రభువుని అమృత వాక్కు ఈ పత్రికకి శ్రీరామ రక్ష.**
విద్యార్థి దశలో, ఏలూరు “పాకల” స్కూల్లో ప్రభువు దర్శన భాగ్యం దొరికింది దశికవారికి. అయితే, “కనుల నీరు నిండెనోయి, కాంచ లేదు నీ రూపం”, అన్న కవి వాక్కు వర్తించింది. పెను తుఫానుల్లో కొట్టిమిట్టాడుతున్న 70వ దశకంలో, అక్క మల్లాది సుశీలాకృష్ణ ఇంట, నరసరావుపేటలో ప్రభు గానం వినిపించింది. అంతే, ఈ బహుదూరపు బాటసారి, ఒక్క సారి ఉళ్ళికిపడి లేచాడు.
‘కనులకొక్కసారి కనిపించుము దేవదేవా’, అంటూ పాట. భావ రాగ తాళ పరమ యోగ సమాధిలో అవతారుని పాదాలకి అంకితమయ్యారు.
ఈ కథ సదాస్మరణీయం.
ఎందుకంటే, “నేను మీ కోసం వస్తున్నాను. అయినా నా ఇచ్ఛ లేనిదే మీకు కనిపించను”, అన్న మెహెరుని ఉవాచ, దశికవారి కథలో, మెహెర్‌బాబా పత్రిక ప్రస్థానంలో అడుగు అడుగునా వినిపిస్తుంది కాబట్టి. అదొక హెచ్చరికగా వినిపిస్తోంది కాబట్టి.
ఎన్నో వేల కోట్ల మందిలో మనకొక్కరికే మెహెరాబాద్ వెళ్ళే అదృష్టం దొరుకుతోందని వెన్ను చరుచు కోవద్దు.
ఆ ప్రయాణం మన ప్రయోజకత్వం కాదు.
ప్రభువు రమ్మని పిలిస్తేనే జరుగుతోంది ఆ యాత్ర. సెంటర్లు పెట్టి, ఏకాహాలు, సహవాస్‌లు, వార పూజలు చేయడం మన గొప్పకాదు.
అది మన గానంలో రాగమైన ప్రభువు చలవ.
ప్రతిఫలాపేక్ష లేకుండా నిర్మలమైన మనస్సుతో ఆరాధించడం మన సొత్తు కాదు.
అది ఒక్క మెహెరాకే చెల్లింది.
మరి మనం ఏం చేయాలి? మమ్మల్ని కూడా ఆ వొరవాడిలో పడేయమని ప్రార్థించడమే!
మన పాటకి మనసు కరిగే వరకూ ఎదురు చూడడమే!
జై మెహెర్‌బాబా జై!

- మల్లాది రామారావు

## ఇంటర్వ్యూ

# మెహెర్‌బాబాతో డాక్టర్ సుభోద్ చంద్రరాయ్



**డాక్టర్ సుభోద్ చంద్రరాయ్ (50) 1964 జనవరి 21 ఉదయం 9 గంటల ప్రాంతంలో మెహెర్‌బాబాను మెహెరాజాద్‌లో కలుసుకున్నాడు.** సుమారు 45 నిముషాలు డాక్టర్ సుభోద్ చంద్రరాయ్ బాబాతో అనేక ఆధ్యాత్మిక విషయాలు ముచ్చటించాడు. ఆనాడు మెహెర్‌బాబాతో డాక్టర్ సుభోద్ జరిపిన ఇంటర్వ్యూకు ఒక ప్రత్యేకత వుంది. డాక్టర్ సుభోద్‌కు చిన్నతనం నుండీ కంటిచూపు లేదు. ఆయనకు సుమారు 7 సంవత్సరాలు వయస్సు వచ్చేసరికి కంటిచూపు బాగా మందగించింది.

పుట్టు గ్రుడ్డివాడు కాదాయన. ఐనప్పటికీ డాక్టర్ సుభోద్ స్వశక్తితో గొప్ప పండితుడు కాగలిగాడు. అమెరికాలోని న్యూయార్క్ పట్టణంలో **న్యూ స్కూల్ ఫర్ సోషల్ రీసెర్చ్‌లో** 1948 నుండి **ఇండియన్ హిందూ స్కాలర్‌గా** పిల్లలకు పాఠాలు చెబుతున్నాడు. ఒక రోజున తన క్లాసు అయిపోయి బయటకు వస్తుంటే రోజ్‌గార్ బేడ్ అనే పాశ్చాత్య బాబా ప్రేమికురాలు మెహెర్‌బాబాకు సంబంధించిన కొన్ని పుస్తకాలు చదవమని సుభోద్‌కిచ్చింది.

ఆదరిమిలా, భారతదేశంలో పర్యటించి సమకాలీన హిందూ ఆధ్యాత్మిక విషయాలు అధ్యయం చేసేందుకు గాను డాక్టర్ సుభోద్‌కు Bright Full Research Scholarship అమెరికా ప్రభుత్వం మంజూరు చేసింది.

డాక్టర్ సుభోద్ చేస్తున్న పరిశోధనా అంశం **"హిందూ మతంలో ఆధునిక పోకడలు"** (Modern Trends in Hinduism). గ్రుడ్డివాడై వుండి అమెరికా ప్రభుత్వం నుండి తన పరిశోధనలకు గాను ఆర్థిక సహాయం అందుకున్న వారిలో తొలి భారతీయుడు డాక్టర్ సుభోద్ రాయ్.

అలా కలకత్తా మహా నగరంలో అడుగుపెట్టిన డాక్టర్ రాయ్ బాబా ప్రేమికుడు శ్రీ ఎ.సి.యస్.చారిని కలిసి మెహెర్‌బాబా గురించి మరింత సమాచారం తెలుసుకుని మెహెర్‌బాబా దర్శనార్థం మెహెరాజాద్‌కు బయలుదేరాడు.

ఐతే, అహ్మద్‌నగర్‌కు బదులు పొరపాటున అహ్మదాబాద్‌కు చేరుకుని, తిరిగి అక్కడ నుండి బయలుదేరి అహ్మద్‌నగర్‌కు వచ్చి, అక్కడ నుండి మెహెరాజాద్‌లో బాబాను దర్శించుకున్నాడు. ఈ హిందూ మతంలోని ఆధునిక పోకడలను అధ్యయనం చేస్తున్న ఈ పండితునికి అవతారుడు తన ఆలింగన భాగ్యం ఇచ్చారు.

అంతేకాదు, అతని బుగ్గలపై రెండు, మూడుసార్లు సుతారంగా ముద్దుపెట్టుకున్నారు.

కాగా, ఈ పండితుడు తన అనుభూతిని, బాబాతో ఆయన జరిపిన ఇంటర్వ్యూ వివరాలను చాలా చక్కగా వివరించాడు.

ఇకపై ఆయన గారి మాటల్లోనే వాటిని పరిశీలించండి!!

"**బాబా**వారి ఆలింగన భాగ్యం నన్నెంతో ఆనందంలో ముంచెత్తింది.

అదే సమయంలో నేను కాస్తంత ఎబ్బెట్టుగా కూడా ఫీలయ్యాను.

ఎందుకంటే మరో మగవాడు ఎవరూ ఇంతవరకూ నన్ను ముద్దు పెట్టుకోలేదు.

ఐతే, బాబా ఎంతో ప్రేమతో, కరుణతో నాకు ఆలింగనం ఇచ్చారు.

మరెంతో ప్రేమతో నా బుగ్గలపై ముద్దు పెట్టుకున్నారు.

ఆయన ప్రేమావతారుడు.

ఆ రోజున బాబా చాలా సరదాగా వున్నారు.

పునర్జన్మ తదితర అంశాలపై నేను అడిగిన అనేక ప్రశ్నలకు జవాబు బాబా ఇచ్చారు.

గ్రుడ్డివాడికి నీ దర్శన భాగ్యం కల్పించడంపై బాబా నీ అభిప్రాయ ఏమిటన్నాను.

నా ప్రశ్నకు బాబా తన చేతిని నా ముఖంపై పెట్టి,

" నా దర్శనం కోసం వచ్చేవారందరూ కళ్ళు ఉండీ, కళ్ళు లేని కబోదులే! అన్నారు.

ఎందుకంటే వారు నా నిజస్వరూపాన్ని దర్శించ లేరు కాబట్టి అని అన్నారు.

ఈ ప్రపంచంలో చాలా కొద్ది మంది మాత్రమే నన్ను **'నిజంగా'** దర్శించుకోగల్గుతారు అని బాబా అన్నారు. మిగిలిన వారందరూ కళ్ళులేని వారేనన్నారు.

నా స్పర్శ, ఆలింగన భాగ్యం పొందిన వారందరూ ధన్యులు.

నీవూ – ధన్యుడవు!! అని నన్ను బాబా అభినందించారు!!

నేను మెహెర్‌బాబాను ఆయన చేపట్టిన మౌన విరమణ ఎప్పుడని అడిగాను.

ఈ ప్రశ్నలోనే జవాబుందని బాబా అన్నారు.

బాబా తాను చేపట్టిన మౌనం ఏదో ఒకనాడు విరమణ చెయ్యాల్సిందేనన్నారు.

త్వరలోనే తన మౌన విరమణ ప్రకటన వుంటుందన్నారు బాబా.

ప్రపంచంలో వున్న అనేక మతాలు గురించి నేను చేసిన అధ్యయనం,

ఆయా మతాల సారాంశం, తదితర విషయాలను బాబాకు వివరించాను.
ఈ విషయాలపై బాబావారి అమూల్య అభిప్రాయం అడిగాను.
అందుకు బాబా క్లుప్తంగా ఇలా అన్నారు.
There are two aspects of religion.
1. The Ceremonial 2. The Spiritual
for Example - The husk and the substance.
ఐతే, ఎప్పుడైతే మనిషి తనలో తాను ఆంతరంగికంగా ప్రయాణిస్తాడో, అప్పుడు తాను ఏ మతానికి చెందినవాడిని కాదనీ, అన్ని మతాలు తనకే చెందుతాయన్న సంగతి విశదమౌతుందని బాబా శెలవిచ్చారు.
బాబా నీ బోధనలు ఏ మతానికి చేరువలో ఉంటాయని ప్రశ్నించాను.
బాబా తన బోధనలు ఏ మతానికి, సిద్ధాంతానికి చెందినవి కాదన్నారు.
ఐతే, సూఫీఇజమ్, జోరాస్ట్రియన్, వేదాంతాల మిశ్రమానికి కొంత చేరువలో వుంటుందని బాబా అన్నారు. పలు మతాలకు సంబంధించిన తులనాత్మక అంశాలపై నేను అమెరికాలో విద్యార్థులకు పాఠాలు చెప్తుంటాను.
బాబా నీవు బాగా అలసిపోయినప్పుడు మౌనంలో నీ సంజ్ఞలు ఎలా ప్రదర్శిస్తావ్ అని అడిగాను. నా ప్రశ్నకు జవాబుగా బాబా ప్రేమతో నా చేతులు తన చేతుల్లోకి తీసుకుని, తన చేతివ్రేళ్ళ సంజ్ఞలు ఎలా వుంటాయో చూపించారు.
నా ప్రశ్నలు నీకు చికాకు తెప్పిస్తున్నాయా? అని బాబాని అడిగాను.
అలాంటిదేమీ లేదని చిరునవ్వులు చిందించారు.
మెహెరాజాద్‌కు రాబోయి, పొరపాటున అహ్మదాబాద్‌కి వెళ్ళిపోయి నా జీవితంలో ఒకరోజు వృధా చేసుకున్నానని నా మనస్సులోని మాటను బాబా ఎదుట వుంచాను.
Time has no real existence in Eternity అని బాబా జవాబిచ్చారు.
Metaphysics పై మరో ప్రశ్నను అడిగినప్పుడు
నీ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు భగవద్వచనం (God Speaks) గ్రంథంలో లభిస్తాయి.
ఆ పుస్తకం తప్పక చదివి, అర్థం చేసుకోమని బాబా హితవు పలికారు.
ఆ మాటలు విన్న నేను, ఎన్నో యుగాలుగా చెబుతున్న సత్యాన్నే తిరిగి నీవు చెబుతున్నట్లుగా వుందని నేను బాబాతో అన్నాను.
బాబా నవ్వుతూ – కాని పక్షంలో అది 'సత్యం' ఎలా అవుతుంది?
'సత్యం ఒక్కటే అన్నారు. మెహెరాజాద్ మండలి హాలులో గోడకు వ్రేలాడుతున్న ఒక లోహపు ప్లేటును చూపిస్తూ ఏరుచ్ని ఆ ప్లేటుపై రాసివున్న అక్షరాలను గట్టిగా పైకి చదవమన్నారు.

నేను మేల్కొల్పుటకే కానీ, బోధించుటకు రాలేదు.

I have come not to teach; but to awaken – Meher Baba.

అని రాసివున్న అక్షరాలను ఏరుచ్ గట్టిగా పైకి చదివాడు.
మెహెర్‌బాబా దయామయుడు. ప్రేమావతారుడు.
మానవాళిపై ఆయనకున్న ప్రేమ అవ్యాజ్యమైనది.
మాటల్లో వర్ణింపనలవికానిది.
బాబాతో నేను జరిపిన ఈ ఇంటర్వ్యూ నా జీవితంలో మరువలేను అని **డాక్టర్ సుభోద్** ముగించాడు.

❀



**విజయవాడ మెహెర్‌బాబా కేంద్రంలో ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. 'సప్తవర్ణపతాకం' పై యువత ప్రసంగించారు.**

# శ్రీకాకుళం సెంటర్ నూతన కార్యవర్గము

శ్రీమతి వి. సీతాకళ్యాణి – **గౌరవ అధ్యక్షురాలు,** శ్రీ బి. నాగభూషణరావు – **అధ్యక్షులు,** శ్రీ జి. సత్యనారాయణ– **ఉపాధ్యక్షులు,** శ్రీ ఎం.బి. వెంకటేశ్వరరావు–**ఉపాధ్యక్షులు,** శ్రీ పి.వి. రంగప్రసాదరావు – **కార్యదర్శి,** శ్రీ పి. భాస్కరరావు – **ఉప కార్యదర్శి,** శ్రీ ఎం. శ్రీనివాసరావు– **ఉప కార్యదర్శి,** శ్రీ ఎం. త్రినాధరావు–**కోశాధికారి,** శ్రీ జి.వి.రమణ – **ఆడిటర్**

**కార్యవర్గ సభ్యులు:–** బి. గోవిందరావు, కె. పార్వతీశం, ఎన్. అప్పారావు, కె. కాశీప్రసాద్, పి.టి. బాబు, ఎన్.వి. సురేష్, చిన్నబాబు, ఎం. మెహెర్ భూషణ్, పి.వి.ఎన్. రవీంద్రనాద్, బి.వి.వి.సూర్యనారాయణ, ఎన్. వైకుంఠరావు, కె. ధనుంజయరావు, శ్రీమతి కె. విజయలక్ష్మి, శ్రీమతి ఎ. లలిత, శ్రీమతి ఎన్. ఉమాదేవి, శ్రీమతి ఎం. శ్రీలక్ష్మి.

# ...సాటి మరొకరు లేరు



మెహెర్‌బాబా ప్రేమికుడు,
పార్లమెంటు సభ్యుడు శ్రీ అమర్‌సింగ్ సైగల్
గురించి చాలామంది పాఠకులకు తెలుసు.
భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు,
అమర్‌సింగ్ సైగల్‌కు మధ్య చక్కని
స్నేహ బంధం వుంది.
మెహెర్‌బాబా గురించి పలు సందర్భాలలో
సర్దార్‌జీ నెహ్రూకు తెలియజేశాడు.
నెహ్రూ అంటే కూడా బాబావారికి
చాలా గౌరవం.
నెహ్రూ గారి సత్యనిష్ఠ, నిజాయితీలను
బాబా కొన్ని సందర్భాలలో
బహిరంగంగానే కొనియాడారు.
భగవద్వచనం గ్రంథంలోని రోజుకు
కొన్ని పేజీలు చొప్పున మొదటి నుంచి చివరి పేజీ దాకా చదవమని నెహ్రూ గారికి
తన మాటగా సూచించమని బాబా సర్దార్‌జీని కోరారు.
భారత ప్రధానిని ఉద్దేశించి ఒక ప్రత్యేక సందేశాన్ని రాసి –మెహెర్‌బాబా
నెహ్రూ గారికి అందజేయమని అమర్‌సింగ్ సైగల్‌కు మార్చి 1963లో ఇచ్చారు.
నెహ్రూ గారు బాబా ఇచ్చిన సందేశాన్ని ఆసాంతం చదివి, అమితానంద
భరితుడయ్యాడని ఆ దరిమిలా సర్దార్‌జీ బాబాకు వివరించాడు.
మెహెర్‌బాబా గత 38 సంవత్సరాలుగా మౌనంగా ఎలా ఉండగల్గుతున్నారని
నెహ్రూ ఆశ్చర్యపడ్డాడని సర్దార్‌జీ పేర్కొన్నాడు.
మెహెర్‌బాబా తొలుత అక్షర ఫలకం వినియోగించారని, ఆ పిదప దాన్ని
త్యజించి సంజ్ఞలు ద్వారా తన సందేశాలు ఇస్తున్నట్లు
ప్రధానికి తెలియజేశానని సైగల్ చెప్పారు.
1953లో న్యూ ఢిల్లీలోని National Stadiumలో
క్రికెట్ మ్యాచ్‌కు మెహెర్‌బాబా హాజరయ్యారు.
ఆ రోజున నెహ్రూ గారు కూర్చున్న సీట్లకు వెనుక వరుసలో దాదాపుగా
చాలా దగ్గర్లోనే బాబా ఆయన మండలివారు కూర్చున్నారు.

ఐతే, ఆ సమయంలో బాబా నెహ్రూ గారిని పలకరించ లేదు.
ఈ విషయాలను సర్దార్‌జీ నెహ్రూ గారికి గుర్తుచేయగానే,
ఆనాడే నాకు మెహెర్‌బాబాను ఎందుకు పరిచయం చేయలేదని నెహ్రూ తనని ప్రశ్నించాడని సైగల్ చెప్పారు
అప్పటికి (1953) నేనే బాబా పరిధిలోకి రాలేదని చెప్పానన్నారు సర్దార్‌జీ.
"నేను త్వరలో (1963 మే 5, 6 తేదీలలో) పూనేలోని గురుప్రసాద్‌లో మెహెర్‌బాబాను దర్శించుకోనున్నాను. ఆ సమయానికి మీరూ తీరిక చేసుకుంటే బాగుంటుందని సర్దార్‌జీ నెహ్రూతో అన్నాడు. ఐతే, ప్రస్తుతం నేను అనేక సమస్యలతో సతమతమవుతూ క్షణం తీరిక లేకుండా వున్నాను.
త్వరలో మెహెర్‌బాబాను దర్శించుకుంటానని భారత ప్రధాని సైగల్‌జీతో అన్నాడు.
ఆ తర్వాత మెహెర్‌బాబా గురించి, పంచ సద్గురువుల గురించి క్లుప్తంగా సర్ధార్‌జీ వివరంగా చెప్పాడు. అలాగే పూనేలో నిర్వహించిన ప్రాక్ - పశ్చిమ సమావేశాల గురించి నెహ్రూకు తెలియజేశాడు.
అంతేకాదు మెహెర్‌బాబా స్వయంగా ఇచ్చిన భగద్వచనం గ్రంధాన్ని నెహ్రూ గారికి బహుమతిగా ఆయన చేతికిచ్చి రోజుకి కనీసం ఐదు నిముషాలు
ఈ పుస్తకంలోని అంశాలను చదవమన్నారని, అది మెహెర్‌బాబా ఆజ్ఞగా నెహ్రూకి తెలియజేశాడు.
అందుకు నెహ్రూ తాను తప్పక ఈ గ్రంధాన్ని చదువుతానని భగద్వచనాన్ని అందుకున్నాడు.
చివరిగా, త్వరలో ఒక రోజున తీరిక చేసుకుని మెహెర్‌బాబా దర్శనం చేసుకోవల్సిందిగా నెహ్రూ గారిని కోరి సైగల్ సెలవు తీసుకున్నాడు.

***

ఐతే, ఏ కారణంగానో తీరిక చిక్కక నెహ్రూ బాబావారిని దర్శించు కోలేదు.
1963 మే నెలలో బాబా గురుప్రసాద్ బంగళా పూనేలో వేసవి విడిదిగా వున్నారు.
ఒక రోజున రాత్రి కాపలాదారుడుగా వున్న భావూజీని బాబా పిలిచి,
నేనిప్పుడు ఏకాంతవాసంలో వున్నాను.
నెహ్రూ కనుక ఎవరికీ చెప్పాపెట్టకుండా పూనేకి నా దర్శనం కావాలని వస్తే ఎలా? అని ప్రశ్నించారు.
ఉన్నఫళంగా నెహ్రూ గారు ఇక్కడకు రాలేడు.
ఒకవేళ బాబాని చూడాలనిపించి ఆయన రావాలనుకుంటే,
మీ అపాయింట్‌మెంట్ కోసం ఎవరినైనా ఒక ఉన్నతాధికారిని ముందుగా మీ దగ్గరకు పంపుతాడు. అలా ఎవరైనా అధికారి వచ్చినప్పుడు, ప్రస్తుతం

బాబా ఏకాంతవాసంలో వున్నారు. కనుక బాబాతో ఎలాంటి సమావేశాలు కుదరవని తెలియజేస్తాం, అని భావూ జవాబిచ్చాడు.
ఐనప్పటికీ, బాబా మరలా ఇదే విషయమై ప్రస్తావిస్తూ,
ఒకవేళ నెహ్రూ ఎలాంటి ముందస్తు అపాయింట్‌మెంటు తీసుకోకుండా ఇక్కడకు వచ్చేస్తే ఏమౌతుంది? అని భావూనీ తిరిగి ప్రశ్నించారు.
అలా ఎన్నటికీ జరగదు బాబా, ఎందుకంటే నెహ్రూ చాలా బిజీగా వుంటాడని భావూ చెప్పాడు.
But, if it does - కానీ…అదే జరిగితేనో
అంటూ … ఇలా ఓ రెండు మూడ్రోజులు బాబా భావూతో ఇదే అంశంపై తర్జన భర్జనలు చేశారు. మే 26 మధ్యాహ్నం 2.30 నిముషాలకు బాబా తన మండలివారితో ఇష్టాగోష్ఠిలో మాట్లాడుతూ
Jawaharlal will come to Me soon; he will have to come!
జవహర్‌లాల్ త్వరలో నా దగ్గరకు వస్తాడు.
అతను ఇక రావల్సిందే!! అని ప్రకటించారు.
అతని మానసిక శక్తి, ధైర్యం వల్లనే గుండెపోటు వచ్చినా త్వరలోనే కోలుకున్నాడు. ఐతే, మరోమారు గుండెపోటువస్తే అతను ఇక బ్రతికి బట్టకట్టలేడు. ప్రాణం వదిలిపెట్టాల్సిందే అని బాబా అన్నారు. 24 గంటలు గడిచాయో లేదో భారత ప్రధాని మరిక లేరు అని ఆకాశవాణి వార్తల్లో ప్రకటించింది.
మెహెరాజాద్ నుండి మండలి సభ్యుడైన మేర్వాన్ మే 27, మధ్యాహ్నం 2.30 నిముషాలకు గురుప్రసాద్‌లో వున్న బాబావారికి ఈ వార్తను ఫోన్‌లో తెలియజేశాడు. అపాయింట్‌మెంట్ లేకుండా నెహ్రూ గారు బాబా దగ్గరకు ఎలా రాగల్గుతాడోనన్న విషయం, బాబా మాటల్లోని అంతరార్థం భావూకి అప్పుడు అర్థమయింది!!
ఆ మర్నాడు మండలివారితో మాట్లాడుతూ బాబా ఇలా అన్నారు:-
నెహ్రూ మరణంతో భారతదేశం తొలి ప్రధానిని మాత్రమే కాదు, నిజాయితీపరుడైన రాజనీతిజ్ఞుడుని కోల్పోయిందని ప్రకటించారు. నెహ్రూ సాటి మరొకరు లేరని, అలాంటి వ్యక్తి కోసం మరో 700 సంవత్సరాలు భారత ప్రజలు వేచియుండాలని బాబా కొనియాడారు. నెహ్రూ ఒక కర్మయోగి అని బాబా అభివర్ణించారు.
ఇటీవల సైగల్ బహుకరించిన భగద్వచనంలోని కొన్ని పేజీలయినా నెహ్రూ చదివి వుంటే మంచిదని బాబా అన్నారు. 700 సంవత్సరాల తర్వాత నేను తిరిగి ఈ భూమ్మీద అవతారం ఎత్తినప్పుడు జవహర్‌లాల్ లాంటివాడు జన్మిస్తాడని బాబా ప్రకటించారు.



ఘనీ రాసిన వ్యాసం

# "అవతార్"

ఇది 1937 నాటి మాట.

మెహెరాబాద్‌లో బాబా సమక్షంలో స్థానిక మండలివారితోపాటు విదేశీ ప్రేమికులు కూడా ఉన్నారా సమయంలో.

బాబా తన ప్రేమికులందరినీ **"అవతార్"** అనే అంశంపైన ఒక వ్యాసం రాయమన్నారు.

బాగా రాసినవారికి మంచి బహుమతి ప్రకటిస్తామన్నారు. అలా రాసిన వ్యాసాలను, ఆయా రచయితలు బాబా ఎదుట, ఉదయం 8 గంటలకు ప్రేమికులందరి సమక్షంలో ఒకరి తర్వాత ఒకరు వచ్చి చదవాలని నియమం పెట్టారు.

ఆ మాదిరిగా 'అవతార్'పై వ్యాసాలు రాసినవారు ఒక్కొక్కరు గత కొద్దిరోజులుగా బాబా ఎదుట తాము రాసిన వ్యాసాలు చదువుతున్నారు. సరే! వరుసక్రమంలో ఒక రోజున డాక్టర్ ఘనీ గారి వంతు వచ్చింది.

మెహెర్‌బాబా మండలి హాల్లోకి వచ్చి కూర్చున్నారు.

బాబా ప్రేమికులందరూ వున్నారు.

ఐనప్పటికీ, ఆ రోజున వ్యాసం చదవాల్సిన ఘనీ మాత్రం రాలేదు.

ఆయన తన గదిలోనే కూర్చుని, తాను రాసిన వ్యాసానికి తుది మెరుగులు దిద్దుతున్నాడు.

ఘనీ ఎంతసేపటికీ రాకపోయేసరికి బాబాకి చాలా కోపం వచ్చింది.

ఇంతలో లోపలకి వచ్చిన ఘనీని ఎందుకంత ఆలస్యమైందని బాబా కోపంగానే అడిగారు.

రోజూలాగానే బాబా ఈ రోజు కూడా ఆలస్యంగా వస్తారేమోననుకున్నానన్నాడు ఘనీ.

దాంతో నేను రాసిన వ్యాసాన్ని మరోమారు దిద్దుకుని, కాస్తంత ఆలస్యంగా వచ్చానన్నాడు ఘనీ.

ఇంతకీ ఏమంటే, గత నాలుగైదు రోజులుగా జరుగుతున్న ఈ వ్యాస పరంపరలో బాబా మండలిహాల్లోకి ఉదయం 8 గంటలు దాటాక సుమారు ఐదు – పది నిముషాలు ఆలస్యంగా వస్తున్నారు. కాబట్టి, ఈ రోజు కూడా అలాగే జరుగుతుందని తాను ఊహించి కాస్త ఆలస్యంగా వచ్చానని

ఘనీ నవ్వుతూ జవాబిచ్చాడు.
నేను ఈ రోజు ఎన్ని గంటలకు మండలిహాల్లోకి వచ్చాను? అని బాబా అక్కడున్న వారందరిని అడిగారు.
ఈ రోజు ఉదయం 8 గంటలకు ఠంచనుగా బాబా మండలిహాల్లోకి వచ్చారని మండలిహాల్లోని ప్రేమికులు చెప్పారు.
ఈ రోజు ఘనీ వ్యాసం చదివే రోజు కదా! అనీ వారన్నారు.
బాబా ఘనీని దగ్గరగా పిలిచి, ఆలస్యంగా వచ్చినందుకు శిక్షగా, గట్టిగా కోప్పడుతూ చెంప చెళ్ళుమనిపించి వెళ్ళి కూర్చోమన్నారు.
కొద్దిసేపయ్యాక బాబా తిరిగి ఘనీని తన దగ్గరగా రమ్మనమని పిలిచారు.
సాధారణంగా అలాంటి సమయంలో,
తిరిగి మరలా పిలిస్తే సాధారణంగా బాబా ప్రేమగా అక్కున తీసుకుని ఆలింగనం ఇస్తారు.
ఘనీ అదే జరుగుతుందని భావించాడు.
ఐతే, అందరూ ఆశ్చర్యపడేలా
ఘనీ మరో చెంపపై బాబా గట్టిగా కోపంగా కొట్టారు.
ఘనీ రెండు చెంపలు ఎరుపెక్కాయి.
ఆ తర్వాత ఘనీ రాసుకొచ్చిన వ్యాసాన్ని గట్టిగా అందరి ఎదుట చదవమన్నారు.
డాక్టర్ ఘనీ ఏమాత్రం తొట్రుపాటు పడలేదు.
అవతారుని నిజమైన ప్రేమికునిగా విధేయతతో
అంతక్రితం ఏం జరిగిందో ఏమీ ఎరుగనట్లుగా,
ఘనీ తన వ్యాసాన్ని బిగ్గరగా, అనర్గళంగా చదివి, అందరి మనస్సులు ఆకట్టుకున్నాడు.
ఆ వ్యాసం విని బాబా కూడా ఎంతగానో ఆనందించారు.
ఐతే, అందరికీ అర్థంకానిది ఏమంటే ఘనీని అంతగా అవమానంచి హేళన చేసినా, రెండు చెంపలూ ఎర్రబడేలా కొట్టినా, ఏమాత్రం చలించకుండా తన వ్యాసాన్ని ఎలా చదువగల్గాడా? అని ఆశ్చర్యపడ్డారు.
జరిగిన అవమానాన్ని ఎలా దిగమింగుకోగలిగాడా? అని అక్కడివారనుకున్నారు.
అవతారునకి అన్నీ తెలుసు కదా!!
మండలి హాలులో తన ప్రేమికుల మనస్సులను తొలిచివేస్తున్న ఆ ప్రశ్ననే బాబా ఘనీని అడిగారు.
నా మాటలు కోపం తెప్పించ లేదా? అని బాబా ప్రశ్నించారు.
దాంతో ఘనీ అందరి మనస్సులు తేలికయ్యేలా జవాబిచ్చాడు.
ఘనీ ఏమన్నాడనుకున్నారు.

బాబా నిజమే!
నీపై నాకు చాలా కోపం వచ్చింది.
కానీ నీవు నా బాల్యమిత్రుడవు కదా!
అందుకే నేనేమీ పట్టించుకోలేదన్నాడు.
బాబాతో సహా,
మండలి హాలులో వున్న వారందరూ ఆ మాటలకు కడుపుబ్బ నవ్వుకున్నారు.
అంతేకాదు, డాక్టర్ ఘనీ రాసిన **'అవతార్'** వ్యాసం,
ఉత్తమోత్తమైందిగా అందరి ప్రశంశలందుకుంది.
మంచి వ్యాసం రాసినందుకుగాను
బాబా ఒక అందమైన సూట్‌ను బహుమతిగా బహుకరించారు.
డాక్టర్ ఘనీ బహు చతుడుడు.
అవతారుని చిన్ననాటి స్నేహితుడు.
ప్రేమికుడూను.

# గుమ్మడి పకాయా...

అ సమయంలో బాబాతోపాటు ఘనీ, ఇతర ప్రేమిక మండలి అందరూ
బెంగుళూరులో వున్నారు.
మండలిలోని ప్రతి ఒక్కనికీ ఒక ప్రత్యేకమైన పనిని బాబా అప్పగించారు.
మండలి సభ్యుడైన బైదుల్‌కు వంటశాల నిర్వహణ అప్పగించారు.
ఆయా పనుల నిర్వహణలో బాగా పొదుపు పాటించిన వారంటే తనకెంతో
ఇష్టమని, సాధ్యమైనంత మేరకు పొదుపు పాటించమన్నారు బాబా.
ఏ వస్తువూ వృధా చేయవద్దన్నది బాబావారి సూచన.
ఐతే తన పొదుపుతో బాబా మెప్పుపొందాలని
బైదుల్ ఏం చేశాడోనన్నది ప్రస్తుతాంశం!!
ఆ రోజుల్లో మార్కెట్‌లో వున్న అన్ని కూరగాయలకంటే
'గుమ్మడికాయ' చాలా చవుగ్గా వుంది.
మండలివారందరికీ సరిపడా 'గుమ్మడి'ని చాలా ఎక్కువగా కొనుగోలు చేసి,
ప్రతిరోజూ ఉదయం గుమ్మడితో బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం, రాత్రి భోజనాల్లోకి
ఇక అంతా గుమ్మడి కూర, చట్నీ, సాంబారు, రసం –
ఇలా భోజనం గుమ్మడి మయం చేశాడు బైదుల్.
దాంతో కొందరికి కడుపునొప్పి, మరికొందరికి మరోకరకంగా

గుమ్మడి తలనొప్పి తెప్పించింది. గుమ్మడి బాధ తీవ్రమయేసరికి తప్పించుకునే ప్రయత్నంలో అందరూ ఘనీసాబ్‌ను సలహా కోసం ఆశ్రయించారు.
మిగిలినవారెవరూ సహసించి ఈ విషయాన్ని బాబా ఎదుట ప్రస్తావించ లేరు కదా!!
బైదుల్ చేసిన పనిని వేలెత్తి చూపించ లేరు.
పొదుపు చర్యల్లో భాగంగా బైదుల్ చేసినదాన్ని ఘనీ కూడా బాబా ఎదుట చెప్పలేక గుమ్మడిపై ఒక పాట
ఇలా రాశాడు.

**"మేరే బైదుల్‌నే 'కోలా' పకాయా హై ఆజ్"**

'కోలా' అంటే గుమ్మడి అనే అర్థం. మా స్నేహితుడు ఈ రోజు గుమ్మడితో వంట చేయించాడు అని అర్థం వచ్చేలా రాయించాడు. బాబా ఎప్పుడైనా ఒక పాట పాడమనగానే ఈ పాటను పాడమని మండలి సభ్యుడొకర్ని పురమాయించాడు ఘనీ. అనుకున్నట్లుగా ఒకరోజు బాబా ఒక పాట పాడమనగానే బాబూరావ్ కాంబ్లే మండలి ప్రేమికుడు లేచి ఈ పాటనందుకున్నాడు.
ఈ పాట విని బాబా కూడా ఆనందించి, అసలు విషయం తెలుసుకుని బైదుల్ని చివాట్లు పెట్టి, మిగిలివున్న గుమ్మడి
స్టాకునంతా భూమిలో గొయ్యితీసి పాతిపెట్టమని ఆదేశించారు.
పొదుపుగా వుండమంటే ఇదా మీరు చేసేదని బైదుల్‌పై బాబా కోప్పడ్డారు.
గుమ్మడి బాధ గాత్రంతో తీరింది. **- సశేషం**

# బాబా లాకెట్‌లు

రాగి మిశ్రమంతో అందమైన మెహెర్‌బాబా డాలర్ లాకెట్‌లను శ్రీ గంపా ఓం ప్రకాష్, హైదరాబాద్ తయారుచేయించారు. ఒక్కొక డాలరు ఖరీదు రూ. 130/- గా నిర్ణయించినట్లు, వలయువారు శ్రీ గంపా ఓం ప్రకాష్, ఫోన్: 98495 69295 సంప్రదించవల్సింది. ఈ డాలర్లపై వచ్చే నగదును మెహెరాబాద్‌లో నిర్మించనున్న మెహెర్ ధర్మశాలకు విరాళంగా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

# వివాహము

శ్రీమతి ముక్క కళావతి, నర్సయ్య గార్ల కుమార్తె చి॥లు॥సౌ॥ ప్రత్యూష వివాహము చి॥ రాఘవేందర్ తో ది: 15.05.2013 ఉ. 11.58 ని॥లకు తిరుమల గార్డెన్స్, విశ్వనాద్‌పేట, నిర్మల్‌లో జరుగుతున్నట్లు ఆహ్వానం పంపినారు.

# బాధలతో విసిగిపోతున్నారా?

–అనంతరెడ్డి, హైదరాబాద్

**మెహెరాబాద్, 1933 నవంబరు 15. మధ్యాహ్న సమయం.**
ఆ సమయంలో మెహెర్‌బాబా వద్దకు అనంతమైన బాధలతో సతమతమౌతున్నానని చెప్పి వచ్చిన ఒక ప్రేమికుడికి, బాబా తన సందేశం ఇలా ఇచ్చారు.
ఆనాడు బాబా సమక్షంలోనే వున్న బాబా మండలి సభ్యుడు **రంజ్జూ అబ్దులా** బాబా సందేశాన్ని ఉన్నదిఉన్నట్లుగా రాసుకుని పలువురికి అందజేశాడు.
బాబా ప్రేమికులందరికీ ఈ సందేశం ఏదో సమయంలో అక్కరకొస్తుందన్న ఆశయంతో పాఠకుల పరిశీలనార్థం ప్రచురిస్తున్నాం...దయచేసి పరిశీలించండి.
ఆ వచ్చిన వ్యక్తితో, బాబా ఇలా అన్నారు.

**ఏమిటీ...**

జీవితంతో విసిగిపోయావా? బ్రతకాలనే లేదా? ఏదో ఒక ఆలోచనలు,
చెడు ఆలోచనలు నిన్ను వెన్నాడుతున్నాయా?
ఏతావాతా సంతోషంగా లేనంటున్నావు.!
ఐతే ఇది తెలుసా?
జీవితమంటేనే ఆలోచనల సమాహారం!
జీవితమంటే కేవలం ఈ స్థూల దేహం మాత్రమే కాదు.
నీవు మంచి గాఢ నిద్రలో వున్నప్పుడు కూడా ఈ దేహం ఉంటుంది.
నిద్రపోయేటప్పుడు మాత్రం చచ్చిపోవాలని నీకనిపించదు.
నిద్రలేచిన లగాయితు తిరిగి ఆలోచనల పరంపర ప్రారంభమౌతుంది.
ఆ మాటకొస్తే ఏ ఒక్కరూ తనకున్నదాంతో సంతోషంగా లేరు.
ఈ ప్రపంచంలో ఒక్కడంటే ఒక్కడు కూడా తనకున్నదాంతో ఆనందంగా లేడు.
పెద్ద హోదాలు, ఉన్నత పదవులు, గొప్ప బ్యాంకు బాలెన్సులున్న ఫలానావారెవరైనా ఆనందంగా వున్నామని చెప్పారా? అని బాబా ప్రశ్నించారు.
అలాంటి వ్యక్తి కూడా నా దర్శనార్థం వచ్చినప్పుడు తన కష్టాల చిట్టా విప్పాడన్నారు.
ఇంతకీ నీకొచ్చిన కష్టం ఏమిటని అలా వచ్చిన ప్రేమికుడిని అడుగుతూ
బాబా ఇలా అన్నారు. నీకేమయింది..నీవు చక్కగా వున్నావు కదా అన్నారు.
ఆరోగ్యంగా వున్నావు. బాగా చదవగలవు..రాయగలవు కూడా...
ఒక్కసారి ఆలోచించు...ఎందరో నిర్భాగ్యులు ఆరోగ్యంలేక, అంగవైకల్యంతో,
ఆకలితో అలమటించేవారు వేలాదిమంది ఈ లోకంలో వున్నారు.

అలాంటి నిర్భాగ్యుల గురించి ఒక్కసారి ఆలోచించు.
పక్షవాతం, కేన్సర్‌వంటి భయానక రోగాలతో రేపటి రోజున బ్రతుకుతామన్న ఆశ కూడా లేక మౌనంగా కాలం వెళ్ళదీసేవారు ఎందరో వున్నారు.
ఈ దేశంలో నిరక్షరాస్యతో, మూగ-చెవుడుతో బాధపడుతున్న అమాయకుల గురించి నీవేనాడైనా ఆలోచించావా? వారితో పోల్చుకుంటే నీవెంతో అదృష్టవంతుడివో కదా అని ఏనాడైనా నీవు ఆలోచించావా? అని అన్నారు.
అవతారపురుషుని కాలంలో జీవిస్తూ, ఆయన సాంగత్యంలో వున్న నీవు ఎంతో అదృష్టవంతుడివి. కారడవుల్లోనో, హిమాలయల్లోనో
నీకు ఆధ్యాత్మిక ప్రశాంతత చిక్కదు. నీ మనస్సులో ఎలాంటి ఆలోచనలు వచ్చినా వాటి మానాన వాటిని రానీయి. ఆలోచనలను అడ్డుకోవద్దు.
ఐతే, చెడు ఆలోచనలు ఏవైనా వస్తే వాటిని ఆచరణలో అమలు చేయొద్దు.
ఆలోచనలు రాకుంటే రాయికి, మనిషికి తేడా ఏముంది?
అలలా వచ్చే ఆలోచనలకు అలజడి చెందొద్దు. వాటికి ఎలాంటి అడ్డుకట్ట వేయొద్దు.
అలా నీలో వచ్చే ఆలోచనలకు నీ మనస్సు బానిస కాకుండా నిగ్రహంగా వుండటం అలవరచుకో. ఈ ఆలోచనల తాకిడిని ఎదుర్కొనే శిక్షణ నీ మనస్సుకు ఇప్పించు. నీ మనస్సు పూర్తిగా నీ అదుపులో వుండే వరకూ, అది సంపూర్ణంగా నశించే వరకూ ఈ ఆలోచనలు, కోర్కెల పర్వం కొనసాగుతుంది.
మనస్సు నాశనమయితే, మనోనాశ్ జరిగితే, సుఖం-దుఖం అనే ఆలోచనలే వుండవు.
ఈ అనంతమైన కోర్కెలు, అలోచనలు అన్నీ కూడా నీ గతజన్మల సంస్కారాల ప్రభావం వల్లనేనని గుర్తుంచుకోమన్నారు బాబా.
ఇంత చెప్పినప్పటికీ నీ బాధలు భరించలేక నీవు చనిపోవాలనుకుంటే, నా కొంగును గట్టిగా పట్టుకుని నీ తనువు చాలించు. నీకు మోక్షం లభిస్తుంది.
అదే నిజమైన మరణం. ప్రాపంచికంగా మరణించడం ప్రధానం కాదు.
ఐతే, ఇంతవరకూ నన్నెవరూ ప్రేమతో సర్వార్పణతో నా కొంగు గట్టిగా పట్టుకోలేదు.
అలా ఎవరైనా నన్ను పట్టుకుంటే వారి నుండి నేను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తాను.
కానీ, నాకా అవకాశం ఇప్పటి వరకూ రాలేదు.
సరికదా, నేనే మిమ్ముల్ని వెంటాడి పట్టుకోవల్సివస్తోందని బాబా చమత్కరించారు.
ఒక్క విషయం గుర్తుంచుకోండి!
ఏమంటే, మీరు చూస్తున్న ఈ ప్రపంచమంతా శూన్యం. దీన్ని అనుసరించి వున్నదంతా అర్థరహితమైంది, క్షణభంగురమైందీను.
మీ మనస్సు వల్లనే మీరు ఈ ప్రపంచాన్ని, స్త్రీలని, పురుషులని, జంతువులనీ వేరువేరుగా భ్రమపడుతున్నారని బాబా తన సందేశం ముగించారు. ❃

# విజయనగరం బాబా సెంటర్ నూతన కార్యవర్గం

**గౌరవ అధ్యక్షులు** - శ్రీ సి.హెచ్. అఘోరపతి, **అధ్యక్షులు** - శ్రీ కొల్లి రామారావు, **ఉపాధ్యక్షులు**-శ్రీ డి.వీరేశలింగం, శ్రీమతి పి. కస్తూరి, **కార్యదర్శి**- శ్రీ నల్లా మెహెర్ శ్రీని, **సంయుక్త కార్యదర్శి** - శ్రీమతి ఎన్.వి. విజయలక్ష్మి మరియు శ్రీ పి. రాజేశ్వరరావు, **కోశాధికారి** - శ్రీ పి. ప్రసాదరావు, **కార్యనిర్వాహక సభ్యులు** - బాలి త్రినాథ్, డి.వెంకట్రావు, సి.వై. చింతామణి, యం.శ్రీనివాస కుమార్, ఎస్.ఎన్.యం.రాజు, టి.పి.సి.హెచ్. బాలాజిరావు, ఎన్. మెహెర్ వాసు, జి. సతీష్, జి. శంకరరావు, జి. శమంతకం, కె. ఉమాదేవి, జి. కృష్ణ కుమారి, కె. సూర్యకుమారి.

## జైబాబా

1. **హైదరాబాద్‌లోని స్థానిక వైద్యులు మెహెర్‌బాబా పత్రిక ప్రచురణలో భాగంగా ఐదు వేల రూపాయలు 2013- మే సంచిక సమయంలో అందజేశారు.**
2. **అలాగే, శ్రీమతి మోటూరి జగన్ మోహన్‌రావు, హైదరాబాద్, మెహెర్‌బాబా పత్రిక ప్రచురణకు ఐదొందలు విరాళంగా అందజేశారు.**

# ఎర్రని చిరునామాలు

**2011 నుండి వార్షిక సభ్యత్వం చెల్లించని సభ్యుల చిరునామాలను పూర్తిగా తొలగించడమైంది. కాగా 2012 జనవరి, ఆ తదుపరి మాసాల నుండి వార్షిక సభ్యత్వం చెల్లించని వారి చిరునామాలను ఈ సంచిక కవరుపై ఎర్రని రంగులో హెచ్చరికగా పంపుతున్నాం. దయచేసి గమనించి బాబా ప్రేమికులు తక్షణమే వారి వార్షిక సభ్యత్వం చెల్లించి సహకరించగలరు. లేనిఎడల ఆయా సభ్యులకు పత్రికలు పంపడం నిలిపివేయవలెనని నిర్ణయించడమైంది. దయచేసి గమనించగలరు. అలాగే, జీవితసభ్యత్వంలో రూ 500 మాత్రమే చెల్లించినవారు కూడా వారి బాకీ నగదు రూ 500 వెంటనే చెల్లించవలెనని మనవి.**

## హెల్ప్‌లైన్

మెహెర్‌బాబా పత్రికను ప్రతి నెలా 25వ తేదీ లోగా మీకు అందడంలో ఆలస్యమైతే శ్రీ వి. ఆర్. కె. శాస్త్రి, హైదరాబాద్ (98492-42284), లేదా శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ వార్షిక, జీవిత సభ్యత్వం సక్రమంగా చెల్లించి సహకరించవల్సింది.**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-4 (1929 మే నుండి) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

ఎటు చూసినా హడావుడి హడావుడి.
ఇక్కడ కష్టమని, స్టేషన్ దగ్గరే వున్న సత్రానికి వెళ్ళారు.
ఆ రాత్రి బాబావారు కన్ను మూయ లేదు.
బాబావారినే చూస్తున్న మండలివారూ రెప్ప వాల్చలేదు.
తెల్లవారాక కూడా బాబావారి ఆరోగ్యం కుదుట పడలేదు.
ఏం చేయాలో తెలియక తలపట్టుకొని కూర్చొన్నారు మండలి.
ఏదైనా మందు తెమ్మంటారా? డాక్టరుని పిలిస్తే బాగుంటుందేమో! అని
వాళ్ళు అనుకొంటుంటే, బాబావారు అదేమీ పట్టించుకోలేదు సరికదా,
మీరందరూ ఊరు చూసిరండన్నారు. తల తిరిగినంత పనయింది మండలికి.
బాబావారు ఓ ప్రక్క అస్వస్థులుగా వుంటే, ఊరు చూసిరావాలా మేము.
ఇదేమి చోద్యము. విన్నవాళ్ళు ఎవరైనా హర్షిస్తారా? దుమ్మెత్తి పోయరు.
అందుకే మిమ్మల్ని వదిలి వెళ్ళమని మొహమాటం లేకుండా చెప్పేశారు.
అంతటి శారీరక బాధలోనూ బాబావారు ఫక్కున నవ్వారు.
మీరు నా దగ్గరకు వచ్చింది మీ మనస్సు చెప్పినట్లు చేయడానికా,
నేను చెప్పినట్లు నడుచుకోడానికా అని నిలదీశారు.
నా మాటని శిరసావహించడం ఎంతో ఉత్కృష్టమైన సేవ అన్నారు.
మీ ఆలోచనలూ, రాగద్వేషాలూ ఎందుకూ పనికిరానివన్నారు.
నామాటని మీరు పట్టించుకోకపోతే, నేను చెప్పినట్లు చేయకపోతే తప్పుకదా
అని అడిగారు. నేను చెప్పినట్లు చేయాలి. నామాట ప్రకారం నడవాలి.
అప్పుడే నన్ను సేవించి తరించగలుగుతారని సేవలో పరమార్ధతని వివరించారు.
తమ మాటని మండలివారు వినాలి. పెడచెవిని పెట్టకూడదు.
అలా చేస్తే తమని కష్టపెట్టినవారు అవుతారని హెచ్చరించారు.
మండలివారి మనస్సుల్ని రాళ్ళగా చేయడం,
ఆ రాతిని ముక్కలు ముక్కలు చేయడం ఇదే తమ ధ్యేయమన్నారు.

బాబావారి సుతిమెత్తని చివాట్లు ఛర్నాకోల పెట్టి కొట్టినట్లే వున్నాయి మండలివారికి.
ఇంకా ఋషులు కాదు కదా.
అందుకనే బాబావారిని వదిలి వెళ్ళటానికి మనస్కరించ లేదు.
కానీ ప్రభువాజ్ఞని ధిక్కరించే సాహసం చేయలేక పోయారు.
వెంటనే ఊళ్ళోకి వెళ్ళారు.
చూడదగ్గ ప్రదేశాలు చూశారు.
నది కనిపిస్తే స్నానం చేశారు.
వీరు తిరిగి వచ్చేసరికి బాబావారు కాస్తంత ప్రశాంతంగా కనిపించారు.
అందరూ కలిసి సుక్కురు బారేజికి వెళ్ళారు.
సింధూ నదిపై కట్టినదీ ఆనకట్ట.
చీకటి పడేసరికి సత్రానికి వాపసు వచ్చారు.
సూర్యుడయితే అస్తమించాడు కాని ఎండ తీవ్రత ఇంకా తగ్గలేదు.
మే 17న మళ్ళీ రైలు ఎక్కారు.
ఇంకో ఇరవై నాలుగు గంటల ప్రయాణం చేస్తేకాని గమ్యం రాదు.
రైలు ఎప్పటిలా కిక్కిరిసి వుంది.
గుమ్మం దగ్గర నిలబడ్డవాళ్ళు లోపలికి దారి ఇవ్వడం లేదు.
ఒకవేళ వాళ్ళని ఎలాగో త్రోసుకొని లోపలికి వెళ్ళినా, కూర్చోవటానికి చోటులేదు.
సర్దుకు కూర్చుందామన్నా, పట్టించుకొనే నాథుడు లేదు.
జగన్నాథుడు తమ మధ్యే వున్నాడని తెలిస్తే, వారేమి చేసేవారో మరి?
పాపం! పెసూకి ఈ ఆలోచన రాలేదు.
అతని తపన అంతా ఏదోలా పెట్టె ఎక్కాలి.
బాబావారిని కూర్చోపెట్టాలి అన్నదే అతని ధ్యాస.
దారికి అడ్డంగా నిలబడ్డ వాళ్ళని బ్రతిమాలాడు, దారి ఇవ్వండి లోపలికి వెళ్ళతామని.
అతని గోడు పట్టించుకొన్నవారే లేరు.
పైపెచ్చు చోటు లేదని చెప్తుంటే, అర్థం కావటంలేదయ్యా అని ఎదురు దాడికి దిగారు.
మాటా మాటా పెరిగింది.
పెసూ కోపం తారా స్థాయికి చేరింది.
పరిస్థితి విషమించేదే!
కానీ బాబావారు పెసూ భుజం తట్టారు.
కోపం వద్దని సంజ్ఞ చేశారు.
అంతే అతను వెనక్కి తగ్గాడు.
ఇంతలో ఎవరో ధర్మాత్ముడు కాస్తంత చోటిస్తే బాబావారు కూర్చొన్నారు.

మీ గొడవ మీదే, నా దారి నాదే అన్నట్లు గార్డు విజిలు వూదటం, బండి కదలటం జరిగాయి. రైలు వేగానికి కాస్తంత గాలి వీచింది.
హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారందరూ.
అప్పుడు బాబావారు పెసూకి క్లాసు తీసుకొన్నారు.
'తన కోపమే తన శత్రువు' అన్న నానుడి గుర్తుచేశారు.
కోపాన్ని జయించు.
కోపాన్ని జయించావో నువ్వు ధీరుడి క్రిందే లెక్క అన్నారు.
క్వెట్టా నగరం సంగతి తెలుసుగా.
అది అందరికీ వేసవి విడిది.
దేశమంతా ఎండ మాడ్చేస్తున్నా, అక్కడ వాతావరణం ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా వుంటుంది.
ఈమాటే చెప్పారు బాబావారు.
క్వెట్టాలాగా నువ్వు ఎప్పుడూ శాంతంగా వుండాలి తప్ప, రోహ్రిలో ఎండలాగా కుతకుత వుడికిపోకూడదన్నారు.
కోపానికి వూగిపోయావంటే, నువ్వు బలహీనుడివేనన్నమాట అన్నారు.
ఫలానా వాడికి బుద్ధి చెప్పాలి.
గుణపాఠం నేర్పాలి అనుకోకు.
తప్పు, అలాంటి ఆలోచన.
ఆగ్రహానికి ఎవ్వరూ బలి కాకూడదు.
నీ రోషాన్ని, నీ కోపాన్నీ అణగద్రొక్కుకో.
ఇదే వాంఛనీయం అని బాబావారు పెసూ మహాశయుడికి జ్ఞానబోధ చేశారు.
బాబావారి మూగ భాషలు, అదే సంజ్ఞలు, చూసేవారికి ఆశ్చర్యం కల్గించాయి.
పరిస్థితి తెలుసు కాబట్టి కోపం తగ్గించుకోమని హితం చెప్తున్నారనిపించింది.
ఈ కిక్కిరిసిన రైలుపెట్టెలో కూడా శిష్యుడికి హితబోధ చేస్తున్న ఈ మహానుభావుడు సామాన్యుడు కాదు.
కారణజన్ముడు అనిపించింది చాలామందికి.
చేతులెత్తి మొక్కాలి అనిపించింది.
దేవభూమి నుంచి వస్తున్నట్లున్నాడీ పుణ్యపురుషుడు సాష్టాంగ దండ ప్రమాణం చేసి మన భక్తిని చాటుకుందామనుకొన్నవాళ్ళు లేకపోలేదు.
కానీ వారెవరికీ ఆ అదృష్టం దక్కలేదు.
రైలు ఎన్నో ఊళ్ళలో ఆగుతోంది.
ఎక్కేవాళ్ళు ఎక్కుతున్నారు.

దిగేవాళ్ళు దిగుతున్నారు.
కానీ రద్దీ తగ్గలేదు సరికదా సీటులో కాస్తంత అటూ ఇటూ
కదులుదామన్నా వీలులేకుండా వుంది.
మే 18 ఉదయానికి రైలు క్వెట్టా చేరింది.
రూసీ ఇరానీ, పెండూ స్టేషనుకు వచ్చారు.
బాబావారికి స్వాగతం పలికారు.
రూసీ ఇంటికి తీసుకువెళ్ళారు.
అక్కడే బాబావారికి బస ఏర్పాటయింది.
బాబావారిని చూస్తూనే ఆనందంతో కేరింతలు కొట్టారు గోహెర్, కేటీ.
వీరిద్దరూ రూసీ కూతుళ్ళు.
పెండూ స్టేషన్‌కి ఎలా వచ్చాడని ఆలోచనలోపడ్డారా పాఠకమహాశయా!
అయితే వినండి!
అతగాడు ఇక్కడే వుంటున్నాడు ఐదు నెలలుగా.
క్వెట్టా వెళ్ళమని బాబావారు అంటే వచ్చాడతను ఇక్కడికి.
సరే, బాబావారి రాకతో రూసీ ఇంటిలో పండగ వాతావరణం నెలకొంది.
ఎంతో దూరం నుంచి బాబావారు వచ్చారు మన ఇంటికి.
మనమెంత అదృష్టవంతులమో అని పొంగిపోయారు రూసీ దంపతులు.
ఈ మాటే బాబావారూ అన్నారు.
“ఎంత దూరం నుంచి వచ్చానో తెలుసా? నిన్ను చూద్దామని పనికట్టుకు వచ్చాను.
నువ్వు ఎంత అదృష్టవంతుడివో, అని బాబావారు అంటుంటే రూసీ కళ్ళలో
నీళ్ళు తిరిగాయి.
నీ దయకి సర్వదా ప్రాప్తుడిని చేయి దేవా అని మనస్సులోనే మొక్కుకొన్నాడు.
మర్నాడు, మే 18న, బాబావారు పార్సీ స్మశాన వాటికకి వెళ్ళారు.
నెర్వస్ సమాధి దగ్గర కాసేపు నిలబడ్డారు.
బాబావారికి ఎంతో ఆప్తుడు నెర్వస్,
ప్రభువు మాటని ఆది గురువు వాక్కుగా స్వీకరించి,
ఆ మేరకు నడుచుకొని తరించిన అదృష్టవంతుడు.
బాబా ఆతని సమాధిపై పువ్వులు వుంచారు.
ఇలా శిష్యుడికి ప్రభువు పుష్పాంజలి సమర్పించిన సందర్భాలు చరిత్ర పుటల్లో
అంతగా కనబడవు.
బహుశా నెర్వస్‌కి శ్రద్ధాంజలి ఘటించడానికే బాబావారు క్వెట్టా వచ్చారేమో?
ఎవరికి తెలుసు...

మానవోద్ధరణ కోసం యుగయుగాలుగా అవతరిస్తున్న ఆదిపురుషుడు
ఒక్క నెర్వస్ తపన తీర్చడం కోసమే క్వెట్టా వచ్చి వుండవచ్చు.
ప్రభువు రాకవల్ల క్వెట్టా తరించింది.
ప్రభువు అడుగుపెట్టడం వల్ల క్వెట్టా పార్శీ స్మశానవాటికలో సమాధి అయిన
అందరూ పునీతులయ్యారు.
నెర్వస్ పేరు చెప్పి, వీరందరికీ తమని చూసే భాగ్యం కల్గిందీవాళ్ళ అని
బాబావారే స్వయంగా చెప్పారు.
ఆహా! నెర్వస్ నిజంగా నువ్వు ధన్యుడివయ్యా!
స్మశానవాటిక నుంచి అందరూ నగర సందర్శనకి వెళ్ళారు.
క్వెట్టాలో చూడదగ్గ ప్రదేశాలు చాలానే వున్నాయి.
అవి చూసి తిరిగి వచ్చేసరికి చీకటి పడింది.
చలి గాలి వీస్తోంది.
ఈ చల్లని గాలి బాబావారికి కాస్తంత ఊరట ఇచ్చినట్లయింది.
ఎందుకంటే రోహ్రిలో కంటే, ఆరోగ్యంగా కన్పిస్తున్నారు.
ఐతే ఛాతీ నొప్పి వదల్లేదింకా.
మేము విడిగా వుంటాము.
మాకో ఇల్లు చూడు అని బాబావారనడంతో రూసీ, చాలా ఇళ్ళు చూసాడు.
మే 21న కనిపించిన ఇల్లు బాగుందనిపించింది.
వెంటనే అద్దెకి తీసుకొన్నాడు.
బాబావారు అందులోకి మారారు.
వెంటనే ఏకాంత దీక్ష పట్టారు.
ఆంతరంగిక కార్యక్రమాన్ని తీవ్రతరం చేశారు.
ఈవాళ్టి నుంచి ద్రవ పదార్థాలు తప్ప ఇంకేమీ తీసుకోనన్నారు.
మండలివారు తమకప్పగించిన పనులు చేపట్టారు.
ఇంతలో బాబావారి నుంచి పిలుపు వచ్చింది.
ఈ ఇల్లు బాగా లేదు.
ఇంకో ఇల్లు చూడండి అన్నారు బాబా.
ఏకాంతవాసానికి ఇల్లు సరిపోవటంలేదని చెప్పారు.
వెంటనే కొత్త ఇంటి వేట మొదలైంది.
బాబావారితో ప్రయాణం అంటే కత్తిపై సాము అని పాఠకులకి తెలుసుకదా.
ఒకో ప్రయాణంలో ఒకో మండలివారికి అక్షింతలు దండిగా పడ్తాయి.
ఎందుకు, ఏమిటి అని అడగకండి.

ప్రభువుకి కోపం ఎప్పుడు వస్తుందో, ఎందుకు వస్తుందో,
ఎదురుగా కళ్ళముందు జరుగుతున్న సంఘటనల వల్ల విసుక్కుంటున్నారా?
ఎక్కడో దూరంగా కష్టాల్లో పడ్డ ప్రేమికుడిని రక్షించడానికి ఎదురుగా వున్న మండలివారిపై
మండిపడుతున్నారా. ఏమో? ఎందుకో ఎవరికీ తెలియదు.
మండలివారికి తెలిసిందల్లా ప్రభువుకి కోపం వచ్చిందని మాత్రమే.
ఆ కోపం పెట్టే పరీక్షలో నెగ్గకపోతే జీవితం దండగ అనీ వాళ్ళకి తెలుసు.
ఈసారి, క్వెట్టా యాత్రలో ఛగన్ బాబావారి ఆగ్రహానికి గురవుతున్నాడు.
మాట్లాడితే చిరుబుర్రు లాడుతున్నారు. విసుక్కుంటున్నారు.
ఎగతాళి పట్టిస్తున్నారు.
పాపం ఛగన్‌కి ఇదొక కొత్త అనుభవం.
ఏదైనా తన దాకా వస్తేనే కానీ తెలీదని ఇందుకే అంటారు.
దు:ఖం ముంచుకు వస్తోంది ఛగన్‌కి.
నేనేం తప్పు చేశానని తన్ను నిలదీస్తున్నారని కొట్టుకుపోతున్నాడు.
కానీ మనస్సులో మాట పైకి చెప్పే సాహసం చేయలేదు.
బాబావారు బువా సాహెబ్‌నీ వదలట్లేదు.
అతడినీ దులిపేస్తున్నారు.
మే 22న అయితే మండలి వారందర్నీ ఝాడించేశారు.
తమ గురించి వారెవరూ పట్టించుకోవటంలేదని నిష్ఠూరంగా అన్నారు.
గుండె నొప్పితో బాధపడుతుంటే ఈ మండలివాళ్ళ సమ్మెటపోటు ఎక్కువైందన్నారు.
ఎప్పుడూ మండలివాళ్ళకి ఏమీ పట్టదు.
బాబావారెలా వున్నారన్న ధ్యాస లేదు.
వాళ్ళ తపనల్లా వాళ్ళ గురించే.
మేము బాగున్నామా? మాకు అన్నీ అమరుతున్నాయా అని తప్ప
మరో ఆలోచన లేదు వాళ్ళకి.
వాళ్ళేమో సరదాగా హాయిగా వుండకపోవటంతో నాకు తలపోటు ఎక్కువైంది.
ఇహ నావల్ల కాదు, ఈ బాధని భరించలేను.
నేను చచ్చిపోతున్నాను.
మీ గొడవతో మీరు నన్ను చంపేస్తున్నారు అని బాబావారు అంటుంటే,
మండలివారికి నోట మాట రాలేదు.
అలా బాబావారికేసే చూస్తూ, బొమ్మల్లా నిలబడ్డారు.
బాబావారి కోపం తగ్గే మార్గం తెలీక తల పట్టుకున్నారు.
అందర్నీ వదిలేసి బాబావారు ఛగన్, బువాసాహెబ్‌లకేసి తిరిగారు.

నాలుగు గంటల సేపు ఉతికేసారు.
రాత్రి ఏడింటివరకూ వాళ్ళిదర్నీ వదల్లేదు.
ఛగన్‌కి కొంచెం ఎక్కువ మోతాదులో పడ్డాయి దీవెనలు.
ఏమనుకొంటున్నావ్.
వుంటేవుండు నా దగ్గర.
పోతే ఫో.
పెట్టాబేడా సర్దుకో అని హెచ్చరించారు.
నీ నడవడిక బాగా లేదు, సహించేది లేదు అన్నారు.
బయటికి గెంటేస్తా జాగ్రత్త అన్నారు.
ఛగన్‌పై బాబావారు అస్త్రాలు ఎందుకు సంధించారో తెలియదు కానీ
అతను మాత్రం గిలగిలలాడి పోయాడు.
బాబావారి ప్రతిమాట అతడిని క్రుంగదీసింది.
ఛగన్‌కి ఏం కావాలి? నా నుంచి ఏమీ ఆశిస్తున్నాడు!
అతడి ధోరణి నాకు అంతుబట్టటం లేదు.
తను కష్టపడుతున్నాడు సరే, నన్ను కష్టపెడుతున్నాడు.
ఇదేమీ బాగా లేదు.
ఛగన్ వేసే వేషాల్ని నేన ఎంతగా భరిస్తున్నానో మీకు తెలీదు.
అసలే నా ఆరోగ్యం అంతంత మాత్రంగా వుంది.
మీకు తెలుసుకదా ఈ సంగతి.
ఇహ నావల్ల కాదు అని బాబావారు మండలివారితో అంటూ ఛగన్‌పై ధ్వజమెత్తారు.
పోతే, పో, వుంటే వుండు అని వార్నింగ్ ఇచ్చారు.
తాము చెప్పిన ప్రకారం నడుచుకొంటేనే తమ దగ్గర స్థానం వుంటుంది తప్ప,
ఛగన్ అనుకొన్న ప్రకారం కాదని కుండబ్రద్దలుగొట్టినట్లు చెప్పారు.
బాబావారి మాటల్ని వింటున్న ఛగన్‌కి గుండె బ్రద్ధలయింది.
కన్నీళ్ళు వరదలయ్యాయి.
ఇదేమీ పట్టించుకోని బాబావారు తమ గదికి వెళ్ళిపోయారు.
కాసేపటికి వాన వెలిసినట్లయింది.
వాతావరణం తేలికపడింది.
బాబావారు చిరునవ్వుతో కనిపించారు.
ఈ వేళ ఛగన్‌కి మోతాదు ఎక్కువయింది కదూ అని బాబావారు అడగ్గానే
మండలివారికి నోట మాట రాలేదు.
సర్వం తెలిసిన ఆది గురువే అలా అడుగుతుంటే బదులేమిస్తామనుకొన్నారు.

సృష్టికర్తకి వాళ్ళ మూగబాధ తెలియకపోతే కదా.
ఆ మాటే బాబావారు అన్నారు.
ఛగన్‌ని చాలా కష్టపెడ్తున్నాను అన్నారు.
రాత్రల్లా నా ప్రక్కనే కాపలా కూర్చొంటాడు, పగలు పడుకోబోతాడు.
కానీ పడుకోనివ్వను.
ఛగన్ పడుకోవటం నాకిష్టముండదు.
అతగాడు ఎప్పుడూ నాదగ్గరే వుండాలి అనిపిస్తుంది నాకు అని భక్తుడిపై
తమకున్న అపార ప్రేమాభిమానాలని ప్రభువు చెప్తుంటే,
ఔరా! ఇదా! అసలు కారణం అనుకోవటం మండలివారి వంతు అయింది.
పాపం నిద్రలేని ఛగన్‌నీ తప్పుపట్టలేము.
ఛగన్ ఎప్పుడూ తమదగ్గరే వుండాలన్న బాబావారి ఇచ్ఛనీ తప్పుపట్టలేము
అని అనుకొన్నారు. ఈ మాటనే బాబావారు చెప్పారు.
నిద్ర లేకుండా సరదాగా కలివిడిగా వుండటం ఛగన్‌కి కష్టమే.
అతనేం చేస్తాడు.
మరి నేను మాత్రం ఏం చేస్తాను. ఛగన్ నా దగ్గరే వుండాలన్నది నా ఇచ్ఛ.
కాబట్టి మా ఇద్దరిదీ తప్పు లేదు అని అంటూ బాబావారు
ఆధ్యాత్మిక మార్గంలో ఎదురయ్యే సాధక బాధకాలని వివరించారు.
ఈ ఆధ్యాత్మిక మార్గంలో దారిపోడవునా కష్టాలే ఎదురవుతాయి.
కడగండ్లు తప్ప మరొకటి కనబడవు.
ఈ దారి అందరిదీ కాదు.
కేవలం హీరోలకే ఈ దారిలో వెళ్ళటం వీలవుతుంది.
పండితులు వేదాంతాన్ని ఔపొసన పట్టమనవచ్చు,
అనర్ఘళంగా మాట్లాడవచ్చు.
కానీ ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు వెళ్ళగలిగేది వాళ్ళు కాదు.
ఆ అదృష్టవంతుడు ఒక్క ధీరోదాత్తుడే.
ఒక్క మాటలో చెప్పాలంటే కత్తిపై సాముపంటిది ఆధ్యాత్మిక యాత్ర అని చెప్పారు.
తాము పెడ్తున్న పరీక్షల పరమార్థం వివరించారు.
మిమల్ని నిద్ర పోనీకూడదు.
మెళుకువగా వుంచాలి. మీరు మెళుకువుగా వుండాలీ అంటే నేను కత్తిని
మీ ఛాతీపై ఝుళిపించాలి.
ఇలా చేస్తే మీరేమో భయంతో, భాధతో కెవ్వున కేక పెడతారు.
కానీ ఏంచేస్తాం, మన పరిస్థితి ఇది.

నన్నేమి చేయమంటారు చెప్పండి అని బాబావారు
అంటుంటే ఛగన్ కళ్ళు మరోసారి చెమ్మగిల్లాయి.
ఈసారి బాధతో కాదు.
అయ్యో, బాబావారు మా కోసం ఎంత కష్టపడుతున్నారో అన్న బాధతో.
బాబావారు ఏంచేసినా మన మంచికే.
బాబావారి సేవలో తరించాలంటే మనస్సులో కోరిక వుంటే సరిపోదు.
గుండె దిటవుగా వున్నా లాభం లేదు.
బాబావారి పరీక్షలో నెగ్గి, ఆధ్యాత్మిక ముళ్ళ బాటలో నడవగల స్థయిర్యం అవసరం.
ప్రభువు అండవుంటేనే ఈ స్థయిర్యం వస్తుంది.
విధేయత వుంటే ప్రభువు అండ లభిస్తుంది అనుకొన్నాడు ఛగన్.
ఇదే భావన మండలివారికీ కల్గింది ఆవాళ.

### ఇంకో ఇంటి వేట

బాబావారి ఏకాంతవాసానికి తగిన ఇంటి వేట సాగుతోంది.
ఎన్నో ఇళ్ళు చూశారు.
ఏదీ నచ్చలేదు. బాబావారికి విసుగువేసింది.
రూసీకి రెండు అక్షింతలు వేశారు.
"నేను వుండటానికే అనువైనచోటు లేదు ఇక్కడ.
ఇహ నువ్వు వుండి లాభం ఏమిటి.
పెట్టా బేడా సర్దుకో.
పెళ్ళాం పిల్లల్ని తీసుకొని క్వెట్టాకి గుడ్‌బై చెప్పేయి" అన్నారు.
బాబావారి మాటల్లోని ఆంతర్యం రూసీకి అంతుచిక్కలేదు.
అసలు బాబావారి మాటల్ని అర్థం చేసుకొనే ప్రయత్నం చేసినట్లు లేదు ఆ మహానుభావుడు.
ఎందుకంటే బాబావారి వ్యాఖ్య ఏదో కాకతాళీయంగా, సరదాగా అన్నది అనుకొన్నాడు.
తప్పు తెలిసేసరికి కొంచెం సమయం పట్టింది.
అది ఎప్పుడు ఎలా జరిగిందో మున్ముందు పాఠకులకి తెలుస్తుంది.

### బొంబాయి రాక

మే 23వ తేదీ సాయంత్రం బాబావారు బొంబాయికి బయలుదేరారు.
మూడు రోజుల తర్వాత ఆ కలల మహానగరం చేరారు.
కాకాబారియా బాబావారికి స్వాగతం పలికాడు.
కానీ సోదరి బానూబాయి, ఆమె భర్త మానెక్జీ కన్‌ఫెక్షనర్ కూడా స్టేషన్‌కి వచ్చారు.
కాకాకి కారు వుంది. ఆ కారుని బాబావారికి సమర్పించాడు.

ఇక్కడ వున్నంతసేపూ నా కారులోనే మీరు తిరగాలి బాబా అన్నాడు.
ప్రభువు భక్తుడి కానుక స్వీకరించారు.
స్టేషన్ నుంచి బాబావారు నేరుగా నౌరోజీ దాదా చాన్జీ ఇంటికి వెళ్ళారు.
స్నానం చేశారు. దర్శనార్థులకి దర్శనం ఇచ్చారు.
కాసేపు విశ్రాంతి తీసుకొన్నాక మెహెరాబాద్ దారి పట్టారు.
అక్కడ మే 27వ తేదీ ఉదయం అడుగుపెట్టారు.
అలా బాబావారు 18 రోజుల్లో సుమారు 3,700 మైళ్ళు ప్రయాణంచేసి వచ్చారు.
క్వెట్టాలో పట్టిన ఉపవాస దీక్షని జూన్ ఒకటవ తేదీ ఉదయం విరమించారు.
కాస్తంత పప్పు అన్నం తిన్నారు.
మెహెరాబాద్ వచ్చిన మర్నాడు అంటే,
మే 28వ తేదీన బాబావారు ఆరంగాం ఫ్యామిలీ క్వార్టర్లకు వెళ్ళారు.
విష్ణు కోసం కబురు పెట్టారు. బాబావారు రమ్మన్నారని పరుగుత్తుకు వచ్చాడు.
చెప్పులు వేసుకోవడం కూడా మరిచి పోయాడు ఆ కంగారులో.
కాసేపు ఆ సంగతీ – ఈ సంగతీ మాట్లాడాక,
బాబావారు విష్ణుని రావ్ సాహెబ్‌ని పిలవమన్నారు.
అతగాడు వెంటనే బయలుదేరుతుంటే,
అంత కంగారు దేనికి! నిదానంగా వెళ్ళు అన్నారు.
చెప్పులు లేకుండా నడవకు.
నా చెప్పులు వేసుకొనివెళ్ళు ఈవాళ అన్నారు.
తన అదృష్టానికి విష్ణు పొంగిపోయాడు.
బాబావారి చెప్పుల కేసి కాసేపు తేరిపారా చూశాడు.
రెండు చేతులతో వాటిని పైకెత్తి, నుదిటికి తాకించాడు.
కళ్ళకి అద్దుకొన్నాడు.
వెంటనే ఆ చెప్పుల్ని బాబావారి పాదాల వద్ద వుంచాడు.
“ప్రభూ! ఇవి మీరు ధరించిన చెప్పులు.
వీటిని నేను పూజించాలి తప్ప, ధరించలేను.
ఇది నావల్ల కాదు” అన్నాడు.
‘అలాగా!
నిజంగానా? అన్నారు బాబా.
బాబావారి మాటల్లో కొంచెం నిష్ఠూరం, మరికొంచెం వ్యంగ్యం కన్పించాయి వినేవాళ్ళకి.
ఇంతకీ బాబావారు ఏమన్నారు? విష్ణువు దురదృష్టవంతుడు అన్నారు.
వేసుకోమని నా చెప్పుల్ని నా అంతట నేను ఇచ్చాను.

కానీ కళ్ళకి అద్దుకొని వాపసు ఇచ్చేశాడు. ఈ రకమైన పూజ నన్ను బాధపెడుతుంది.
ఇలాంటి గౌరవం నా మనస్సుని చివుక్కుమనేలా చేస్తుంది.
పూజ చేశాననుకోవచ్చు విష్ణు. కానీ నా దృష్టిలో అది పూజకాదు.
నాకు శిక్ష వేయడమే. నా మాట ప్రకారం చేయకుండా అవిధేయత చూపించితే
నన్ను పూజించినట్లు కాదు. కానీ నన్నేదో అందలంపై కూర్చోబెట్టి గౌరవిస్తున్నానని
విష్ణు అనుకొంటున్నాడు. విష్ణు చేస్తున్నది పూజకాదు. నాకు శిక్ష అన్నారు.
తమ మాట వినకపోవడం అవిధేయత అని తేల్చిచెప్పారు.
తమ తమ మనోభావాల మేరకి విష్ణువులా పూజించడం కూడా పరమ అవిధేయత
అని స్పష్టం చేశారు. విష్ణు చేస్తున్న పూజ నాకుకాదు. అతని మనోభావాలకే అన్నారు.
ఆ పూజ ముందు నా ఆజ్ఞ ఎంత అనుకొంటున్నాడు విష్ణు.
ఆ పూజలే నా ఆజ్ఞ కంటే సర్వోత్కృష్టమైనవని అతని భావన.
నాకు మనస్తాపం కల్గిస్తుందీ దృక్పథం అన్నారు బాబా.
బాబావారి మాటలు అంతుపట్టలేదు ఎవరికీ. బాబావారి పాదరక్షలు పవిత్రమైనవి
కావా! యుగావతారుడు నడిచిన నేల పావన క్షేత్రం, వాడిన వస్తువులు,
వేసుకొన్న బట్టలు, వాడే చెప్పులు ఎప్పటికీ పూజించదగ్గ పవిత్ర వస్తువులు.
ప్రభువు నడిచే దారిలో చిన్న రేణువుగా వున్నా చాలు, జన్మ ధన్యమవుతుందనుకొనే
ప్రేమికునికి ప్రభువు స్పృశించిన ప్రతిదీ పూజింప దగ్గదే.
ఈ మాటనే ఛగన్ అన్నాడు.
మీ పాదరక్షలు పవిత్రమయినవని అనుకోకూడదా అని అడిగాడు.
చిరునవ్వుతో బాబావారు చెప్పిన జవాబు, పూజకీ, పూజితుడికీ మధ్య తేడాని వివరించింది
కాదేదీ కవితకనర్హం అన్నట్లు, భగవానుడి ప్రతి వస్తువు పూజకి అర్హం కావచ్చు కానీ,
వాటిని మించిన మరో వస్తువు వుంది.
సాధకుడు ఆ వైనం మరచిపోకూడదని బాబావారు పేర్కొన్నారు.
తమకి చెందిన వస్తువు పవిత్రమైనదేనన్నారు.
వాటిని పూజించాలనుకోవటం కూడా మంచిదేనన్నారు.
మీకు నేను కావాలో, నేను వాడిన, వాడుతున్న వస్తువులు కావాలో
తేల్చుకోవాలన్నారు.
ఎందుకుట అంటే, బాబావారి కంటే, బాబావారి వస్తువులు
గొప్పవి వావు! కాలేవు కదా! తమ మాట సర్వోత్కృష్టమైనదని బాబావారు స్పష్టంచేశారు.
తమ మాటని గౌరవించమన్నారు.
తమ వస్తువులకంటే, తమ మాటనే శిరోధార్యంగా స్వీకరించమన్నారు.
తమ ఇచ్ఛ ప్రకారం నడుచుకోమన్నారు.

తమ ఇచ్ఛ ముందు భక్తుల మనోగత భావాలు ఈ ఉద్వేగాలకీ స్థానం లేదన్నారు.
"నా ఇచ్ఛ అమలు
చేస్తుంటే, మీ మనోభావాల వ్యక్తికరణకి చోటివ్వకండి".
భావోద్వేగాలని దూరంగా పెట్టండి అని బాబావారు శెలవిచ్చారు.
కాదేదీ పూజకనర్హం, అయినా పూజితుడొక్కడే.
పూజితుని మాటముందు మరి దేనికీ విలువలేదన్న పరమ సత్యం
విష్ణు పుణ్యమా అని నలుగురికీ తెలిసిందావాళ.
బాబావారు ఉల్లాసంగా కన్పించారు అందరికీ.
కొత్త ప్రశ్న – జవాబులు మొదలయ్యాయి.
**బాబా:** నేను మలవిసర్జన చేసినప్పుడు ఆ మలము పరీక్షగా చూశారా ఎవరైనా?
**కొందరు:** ఆ! చూశాము బాబా
**ఇంకొందరు:** అబ్బే! లేదు బాబా! జాగ్రత్తగా చూడలేదు.
**బాబా:** నా మలము చూసినవాళ్ళు చెప్పండి అది ఎలా వుంటుందో?
"చూశాము" అన్నవాళ్ళు ముందుకు వచ్చారు. తోచిన రీతిలో వర్ణించారు.
బాబావారు పెదవి విరిచారు.
మీరెవ్వరూ సరిగ్గా చెప్పలేకపోయారన్నారు.
తమ మలములో ఏముంటుందో ఊహించలేరు మీరు అన్నారు.
నేను చెప్తాను వినండి అన్నారు.
సృష్టి ప్రారంభంలో మలవిసర్జన చేసినప్పుడు సూర్య చంద్రులు, నక్షత్రాలు,
లోకాలు అన్నీ బయటకి వచ్చాయన్నారు.
ఇవన్నీ నా సృష్టి, మలవిసర్జనలో వచ్చాయి.
అయినా అందంగా వున్నాయి.
మరి నా మాలిన్యంలో వచ్చిన వస్తువులే ఇంత అందంగా వుంటే,
నేనెంత అందంగా వుండాలి?
నా నిజరూపం ఎంత దేదీప్యమానంగా వెలిగిపోతుండాలి,
ఊహించండి ఒక్కసారి! అన్నారు.
తమ నిజస్వరూపం కొంచెం లీలగా చూడగలిగినా,
అమ్మో! అనిపిస్తుంది మీకు.
బుర్ర తిరుగుతుంది.
మతి పోతుంది ఆ కాస్తకే అన్నారు.
తమ నిజరూప వైభవం మీరూహించలేరని స్పష్టం చేశారు.

**(సశేషం)**

# అవతారుని దివ్యధామం




**(పేరూరి శ్రీనివాసరావు, తణుకు, 85007-06668)**

అవతార్ మెహెర్‌బాబా తానేమీ మహిమలు చేయనంటారు.
కానీ, ఆపదలోనున్న వారు తమ హృదయాంతరాళ్ళ నుండి ప్రార్థిస్తే,
బాబా తప్పక ఆలకిస్తాడు. ఆర్తులను ఆదుకుంటాడు. మెహెర్‌బాబా ప్రేమావతారుడు.
ఇది బాబా ప్రేమికులందరికీ అనుభవైక్యం.
ఆ కోవకు చెందినదే మాకు ఈ మధ్య తారసపడిన ఈ చిన్ని సంఘటన.
దయచేసి పరిశీలించండి.
ఈ మధ్య నేను ఉద్యోగరీత్యా తణుకు నుండి రైల్లో రోజూ కొవ్వూరు వెళ్తున్నాను. నా రైలు ప్రయాణంలో మరో నలుగురు గవర్నమెంటు ఉద్యోగులు పరిచయమయ్యారు. మాటల మధ్యన అవతారుడి మెహెర్‌స్థాన్ స్వర్ణోత్సవ వేడుకలు గురించి, కొవ్వూరు మెహెర్‌స్థాన్ ప్రాధాన్యత వారికి చెప్పాను. ఒక రోజున మేమందరం కలసి మెహెర్‌స్థాన్ బాబావారి దర్శనార్థం ఉదయం 8.30కి వెళ్ళాం. ఆ సమయంలో ఒక మధ్య వయస్సు గల స్త్రీ మెహెర్‌బాబాని దర్శించుకొని బయటకు వస్తూ మాకు జైబాబా అని చెప్పింది. నేను ఆమెను రోజూ చూస్తున్నాను కాని, ఎప్పుడూ పలకరించ లేదు. ఆ రోజు మాత్రం నేను ఆమెకు జైబాబా చెప్పాను. ఆ మాటా గట్రా అయ్యాక ఆమెకు గల మెహెర్‌బాబా తాలూకా అనుభవం గురించి చెప్పమని అడిగాను. ఆమె కాసేపు తటపటాయించినా తన గురించి క్లుప్తంగా ఆమె ఇలా చెప్పింది. "నా పేరు గోసల సత్యవతి. మేం మత్స్యకారులం. నాకు ముగ్గురు కుమార్తెలు, ఒక కొడుకూను. నా చిన్నప్పటి నుండి మెహెర్‌స్థాన్‌లో ఆడుకునేవాళ్ళం. కానీ, మెహెర్‌బాబా అంటే ఎవరో నాకు తెలియదు. కొన్నాళ్ళ క్రితం మా అబ్బాయికి నిజామాబాద్‌లో ఉద్యోగం వచ్చి వాడు అక్కడకి వెళ్ళాడు. ఈ మధ్య ఒకరోజున అక్కడ్నుంచి ఫోను వచ్చింది. మా అబ్బాయిని పాము కాటేసిందని, పిల్లవాడు అపస్మారక స్థితిలో ఉన్నాడని, బ్రతకడం కష్టమని డాక్టర్లు చెప్పారని ఫోన్‌లో చెప్పారు. నాకు మతిపోయింది.

ఏం చేయ్యాలో తెలియలేదు. ఇంతలో మా చుట్టు ప్రక్కలనే ఉండే ఒకామె, నాకు ధైర్యం చెబుతూ ...ఇప్పుడు ఏం చేయగలం. గుడిలో వున్న మెహెర్‌బాబాకు నీ కష్టం చెప్పుకో. అంతా ఆయనే చూసుకుంటాడని సలహా ఇచ్చింది. వెంటనే బాబా గారి విగ్రహం దగ్గరకెళ్ళి భోరుమని ఏడ్చేశాను. తల బాదుకున్నాను. నాకు దిక్కెవ్వరూ లేరని బాబాతో మొరపెట్టుకున్నాను. నాకు చదువురాదు. ప్రార్ధనలు తెలియవు. తెలిసిందల్లా బాబా నామం మాత్రమే. **బాబా...బాబా అంటూ** ఏడుస్తూ బాబా విగ్రహాన్ని వదలలేదు. అలా ఆ రాత్రంతా గుడి లోపలే బాబా విగ్రహం దగ్గరే గడిపాను. చుట్టుప్రక్కల వాళ్ళందరూ నన్ను చూసి జాలిపడ్డారు. తెల్లవారాక నిజామాబాద్ నుండి ఫోను వచ్చింది. పిల్లవాడిలో కొంత కదలిక వచ్చిందని చెప్పారు. అదే రోజు సాయంత్రానికి పూర్తిగా కోలుకున్నాడని మరో ఫోను వచ్చింది. బాబా నా ప్రార్ధనలు ఆలకించాడు. నాకు పుత్ర భిక్ష పెట్టాడని, నా బిడ్డని కాపాడాడని ఆమె చెమర్చిన కళ్ళతో కృతజ్ఞతలతో రెండు చేతులూ జోడించింది. బాబా మహిమలు కోకొల్లలు. అవతార్ మెహెర్‌బాబా కలియుగ దైవము. ఆయన ప్రేమ సందేశము మన జీవితాలకు మార్గ దర్శకం. మెహెర్‌స్థాన్‌లో బాబా కొలువై వున్నాడు. నమ్మిన వానికి కొంగు బంగారం !!

# శ్రీ గణేష్ బాబాలో ఐక్యం



**శ్రీ ఎ.వి.జి. గణేష్, బెంగళూరు,** 2013 ఏప్రిల్ ఒకటిన రాత్రి 10.45కు బాబాలో ఐక్యమయ్యారు. ఆంధ్రా బ్యాంకులో ఉన్నతోద్యోగిగా పనిచేసిన శ్రీ గణేష్, కర్నాటకలోని బాబా కేంద్రాలైన భైరమంగళ, పావగడ, బెంగళూరులలో ఏర్పాటుచేసిన అనేక బాబా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారని, ఆయన కుమారుడు శ్రీ ఎ.వి.జి. హరిప్రసాద్ తెలిపారు. అలాగే తన తండ్రి దేహాన్ని బెంగళూరులోని యం.ఎస్.రామయ్యా మెడికల్ కాలేజీకి, వైద్య విద్యార్థుల సహాయార్ధం అప్పగించినట్లు శ్రీ హరిప్రసాద్ తెలిపారు. ఆ పిదప తమ గృహంలో బాబా ప్రేమిక సహవాస్ ఏప్రిల్ 11న ఏర్పాటు చేసామని, ఈ కార్యక్రమంలో పావగడ, ధర్మవరం, హిందూపురం, బెంగుళూరు, హైదరాబాద్, చెన్నైల నుండి పలువురు బాబా ప్రేమికులు పాల్గొన్నారని ఆయన అన్నారు. బాబా సందేశాలను తు.చ తప్పక పాటించే తన తండ్రి కోర్కె మేరకు ఎలాంటి కర్మకాండలు, ఆడంబరాలు లేకుండా బాబా నామస్మరణతో కార్యక్రమాలు నిర్వహించామని హరిప్రసాద్ తెలిపారు.

# ఆనతి... నీయరా!



**శ్రీ కోదూరి ప్రసాద్‌తో మా ప్రతినిధి**

మెహెర్‌స్థాన్ పసిడి పండుగ వేడుకలు 2013 ఫిబ్రవరి 28న ఘనంగా ముగిసాయి. ఎందరో బాబా ప్రేమికులు పలు ప్రాంతాల నుండి విచ్చేశారు. మెహెరాబాద్‌లో మెహెర్‌బాబా దర్శన కార్యక్రమంలో పాల్గొన్నామన్నంత అనుభూతి అనుభవించినట్లు పలువురు బాబా ప్రేమికులు భావించారు. ఇటీవల ఏప్రిల్ 28న మెహెర్‌స్థాన్‌కు వెళ్ళిన మెహెర్‌బాబా పత్రిక ప్రతినిధి, శ్రీ కోదూరి శివరామకృష్ణ ప్రసాద్ గారిని ఇష్టాగోష్ఠిగా కలవడమైంది. ఈ సందర్భంగా మెహెర్‌స్థాన్ నిర్మించి అర్ధ శతాబ్దం పూర్తయింది కదా! శ్రీ కోదూరి కృష్ణారావు గారి తనయునిగా **మెహెర్‌స్థాన్** భావి కార్యక్రమాల ఏర్పాటు ఎలా వుండబోతోంది అని అడిగిన మా ఏకైక ప్రశ్నకు శ్రీ కోదూరి ప్రసాద్ తన మనస్సులోని మాటలను చాలా వివరంగా ఇలా చెప్పారు. ఇకపై ఆయన మాటల్లోనే ఆ వివరాలు పరిశీలిద్దాం!!

"**కొవ్వూరులో** మెహెర్‌స్థాన్ నిర్మాణానికి ముందుగా మెహెర్‌బాబా అనుమతి నిరాకరించడం, ఆ దరిమిలా ఆయన అంగీకరించడం, 1960 ఫిబ్రవరి 25న శంఖుస్థాపన, 1963 ఫిబ్రవరి 28న లాంఛనంగా మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ విషయాలు బాబా ప్రేమికులందరకూ తెలుసు.

మెహెర్‌బాబా స్వయంగా **తన ఇంటిని – మెహెర్‌స్థాన్‌ని** కొవ్వూరులో నిర్మించుకున్నారు. మా నాన్నగారిని అందుకు ఒక పనిముట్టుగా ఉపయోగించుకున్నారు. అందులో ఎలాంటి సందేహం లేదు. ఎందుకిలా అంటున్నానంటే, ఆ రోజుల్లో మా నాన్న గారు మెహెర్‌స్థాన్ నిర్మాణం చేపట్టేటంత ధనవంతుడు కాదు. మాది సాధారణ ఎగువ మధ్య తరగతి కుటుంబం. రాజకీయంగా గొప్ప పలుకుబడి వుంది. పశ్చిమ గోదావరి జిల్లా బోర్డు కార్యదర్శిగా, స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న నాయకుడిగా, ఆనాటి రాజకీయ ప్రముఖులు– శ్రీ కళా వెంకట్రావు, శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి తదితరుల అంతేవాసిగా మా నాన్న మంచి స్థితిలోనే వున్నాడు. కానీ, మెహెర్‌స్థాన్ నిర్మాణం స్వయంగా చేపట్టే స్తోమత ఆయనకు లేదు. మెహెర్‌బాబా కాంశ్య విగ్రహం తయ్యారీకి పదహారు వేల రూపాయలుగా

నిర్ణయించారు. అందుకు అడ్వాన్సుగా రూ. 3 వేలు ఇవ్వాల్సివస్తే, మెహెర్‌స్థాన్ వెనక్కాల గల బ్రాహ్మణ అగ్రహారంలో వున్న కొద్దిపాటి స్థలాన్ని అమ్మితే సరిగ్గా రూ. 3 వేలు వచ్చింది. ఆ నగదును తలాం స్టూడియో, ముంబాయికి అడ్వాన్సుగా పంపడమైంది. ఇలా మెహెర్‌స్థాన్ నిర్మాణంలో ఎప్పటికప్పుడు అవసరమైనప్పుడల్లా ఆయా డబ్బును ఏదో రీతిన మా నాన్న సర్దుబాటు చేశారు. ఇందుకు మా అమ్మగారి బంగారు నగలు, నా పెళ్ళికిచ్చిన కట్నం కూడా ఖర్చయ్యిందని నాకు తెలుసు.

మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవం సంబరాల సమయంలో కూడా తగినంత డబ్బులు సర్దుబాటు కాలేదు. సుమారుగా రూ. 11 వేలు అవసరం వుంది.

మోటారు లాంచీల ఇంజన్లు కొంటామని కేరళ నుండి ఎవరో వర్తకులు వచ్చి, మా దగ్గరున్న ఇంజన్లు చూసి సరిగ్గా పదకొండు వేలు ఇస్తామన్నారు. ఆ గండం అప్పటికి అలా తీరింది.

అలా అడుగడుగునా ప్రశ్నార్థకంతో నిర్ణీత కాలంలో **మెహెరుడి ఇల్లు - మెహెర్‌స్థాన్** నిర్మాణం మా నాన్నగారు పూర్తిచేశారు. అలా అనేకంటే కూడా –మెహెర్‌బాబా మా నాన్నగారితో కొవ్వూరులో తన ఇంటిని నిర్మించుకున్నారని నా గట్టి నమ్మకం!! నేను మా నాన్న గారితోనే ఎక్కువగా ఉండేవాడిని.

మా నాన్నతో బాబావారి దగ్గరకి కూడా చాలాసార్లు వెళ్ళాను.

మెహెర్‌స్థాన్ నిర్మాణం పూర్తయ్యాక, రెండు గదుల గెస్ట్‌హౌస్ నిర్మాణం కూడా చేపట్టారు. సుమారు ఈ సమయంలో మా నాన్న బాబాను అడిగారో? ఏమో? తెలియదు కానీ, ముంబయిలోని బాబా ప్రేమికుడు నారిమన్ దగ్గర్నుంచి రూ. 25 వేలు రుణంగా తెప్పించి బాబా మా నాన్నకి ఇచ్చారు. వడ్డీ లేని రుణంగా ఆ నగదు బాబా ఇప్పించారు. నేను ఆ సమయంలో కూడా మా నాన్నతో వున్నాను.

ఆ దరిమిలా వడ్డీ లేకుండా తీసుకున్న 25 వేల రూపాయలను మండలి సభ్యుడు ఏరుచ్‌కి ఇచ్చివేశాను. ఏ సంవత్సరమో గుర్తు లేదు కానీ, ఈ అప్పు గురించి ఏరుచ్ ఉత్తరం రాస్తే, మెహెరాజాద్‌కి వెళ్ళి నేనే ఆ అప్పు తీర్చివేశాను.

ఇదంతా ఎందుకంటే ఒక సాధారణ వ్యక్తి చేత బాబా తన ఇంటిని ఇక్కడ నిర్మించుకున్నారు అని తెలియజేయడానికే ఇంత స్పష్టంగా చెప్తున్నాను.

ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, ఆయా సమయాల్లో అవతారుడు ఆదుకుని, తన ఇంటిని నిర్మించుకున్నాడు. ఐతే, మెహెర్‌స్థాన్ నిర్మాణం పూర్తయి, ప్రారంభోత్సవ వేడుకలు జరిగాక మా నాన్నగారు ఎంతోకాలం లేరు. సుమారు రెండున్నరేళ్ళకే ఆయన బాబాలో ఐక్యమయ్యారు. ఆదే మాదిరిగా బాబా కూడా 1969 జనవరి 31న భౌతికంగా మన నుండి దూరమయ్యారు. మా నాన్న గారు చనిపోయాక మెహెర్‌బాబాను నేను దర్శించుకున్నప్పుడు మెహెర్‌స్థాన్ నా దివ్య ధామం. నేను అక్కడ కొలువై

వున్నానని హెచ్చరించారు.
అంతేకానీ, మెహెర్‌స్థాన్ నిర్వహణ బాధ్యత ఎవరు చేపట్టాలి, ఏం చేయ్యాలనే విషయం బాబా స్పష్టం చేయలేదు.
మెహెర్‌స్థాన్ నిర్మాణం పూర్తయ్యాక, మీ తదనంతరం దీని నిర్వహణ బాధ్యతలు ఎవరు చూస్తారు? నిర్వహణ కోసం ఏమైనా ఆస్థిపాస్తులు ఏర్పాటు చేశారా? వంటి ప్రశ్నలు స్థానిక పెద్దలు కొందరు ఆనాడే మా నాయన్ని అడిగారు.
ఐతే, ఆ సమయంలో తన తదనంతరం తన కొడుకు, ఆ తర్వాత, బాబా పేరు పెట్టుకున్న తన మనుమడు మెహెర్‌స్థాన్ బాగోగులు చూసుకుంటారని మాటవరసకు భరోసాగా అన్నారుగానీ ఇతిమిద్ధంగా మానాన్న ప్రత్యేకంగా ఏమీ చెప్పలేదు.
ఆ రోజుల్లో మా నాన్న మెహెర్‌బాబా దర్శనార్థం వెళ్ళివస్తున్నా,
బాబా పట్ల మా తండ్రిగారితో పోల్చితే నాకంత ప్రేమ, భక్తిభావాలు లేవని నా మనస్సుకు తెలుసు. ఆ తర్వాత్తర్వాత మెహెర్‌స్థాన్‌లో బాబా కార్యక్రమాలు ఏవైనా నిర్వహిస్తూ నన్ను ఆహ్వానించినా, కొద్దిసేపు ఆ కార్యక్రమాల్లో కూర్చుని, నాకేదో పని ఒత్తిడి వుందని కార్యక్రమం పూర్తయ్యేదాకా వుండకుండా వెళ్ళిపోయేవాడిని.
1980 నుండి మెహెర్‌స్థాన్‌లో బాబా కార్యక్రమాల నిర్వహణ బొత్తిగా లేకుండింది. ఎవరెవరో వచ్చి ఇక్కడి హాల్లో పడుకునేవారు. రాత్రిళ్ళు పేకాట వంటి ఆటలు కూడా ఆడేవారని నాకు తెలిసింది. వారందరూ మేమెరిగిన వాళ్ళే. మేం కన్నెర్రచేస్తే దూరంగా వెళ్ళిపోతారు. కానీ నేనెన్నడూ అదీ పట్టించుకోలేదు.
నా ప్రశ్న ఏమంటే – ఈ పవిత్ర ప్రాంగణం నిర్వహణ బాధ్యత ఎవరు చేపట్టాలి?
**నేను చేపట్టాలా? మా కుటుంబ సభ్యులా? లేక బాబా ప్రేమికులా అన్నది నా ముందున్న పెద్ద ప్రశ్న!! ఇది నాకొక పరీక్షలా వుంది.**
ఆ దరిమిలా 1999 ప్రాంతంలో స్థానిక బాబా ప్రేమికులు శ్రీ తోట పద్మనాభరావు, శ్రీ ఎ. నారాయణరావు, శ్రీ ప్రసాద్ రాజు గార్లను మా ఇంటికి పిలిచి వారితో ఈ విషయమే ప్రస్తావించాను.
నా ప్రశ్నకు తగిన సమాధానం మండలివారిని అడిగి చెప్తామన్నారు.
వారు అవతారుని మౌన వార్షికోత్సవానికి మెహెరాబాద్ వెళ్తున్నామని, ఆ సమయంలో మండలి సభ్యుడైన ఏరుచ్‌ని సంప్రదిస్తామన్నారు. ఈ విషయమై నేను బాబా కార్యదర్శి ఆదీ కె ఇరానీని కూడా అడిగాను. ఆదీజీ కానీ, ఏరుచ్ కూడా నా ప్రశ్నకు సూటిగా జవాబు చెప్పలేదు. ఇటీవల ట్రస్టు చైర్మన్ భావూజీని మా కుటుంబ సభ్యులందరితో అహ్మద్‌నగర్‌లో కలిశాను!! భావూ కూడా నా ప్రశ్న వింటూనే...
నా భార్యకేసి చూస్తూ, నీవు ఆ బాధ్యతలు చేపట్ట లేవా? అని నవ్వుతూ మాట తప్పించారు, కానీ సూటిగా జవాబివ్వలేదు. నాటి నుండీ నేటి వరకు ఇదే ధోరణి కనబడుతోంది. మెహెర్‌స్థాన్ బాధ్యత నేను చేపడితే స్థానిక బాబా ప్రేమికులు

ఊహించిన రీతిలో నేను నిబద్ధతతో ఆ బాధ్యతను నిర్వహించగలనా?
అందుకు తగిన న్యాయం చేయగలనానన్నది నా సంశయం...
ఆ బాధ్యతలేవో మెహెర్‌బాబా ప్రేమికులకే అప్పగించేస్తే -నా భుజం నుండి
ఆ బాధ్యతలు తప్పించుకుని, తప్పుచేసినవాడిని అవుతానా? అనే సంశయం,
ఈ డోలాయమానంలో, సందిగ్ధంలో, సంఘర్షణలో వున్న నాకు ఒక చెంప కొందరు
బాబా ప్రేమికులు, నా భార్య, కుటుంబ సభ్యులు, పలువురు పలు రకాల సలహాలు
ఇస్తున్నారు. అవేవీ నాకు ఏకాభిప్రాయాన్ని ఇవ్వలేదు. అలాగే నాకు ఆమోదంగా
కూడా లేవు!! ఇది క్లిష్ట సమస్య కాదు కానీ స్పష్టమైన అభిప్రాయాన్ని నేను ఆశిస్తున్నాను.
మెహెర్‌స్థాన్ ప్రాంగణంలో మెహెర్‌బాబా ఒక వాచ్‌మెన్‌ని నియమించమన్నారు.
మొదట్లో లక్ష్మయ్య అనే వ్యక్తి ఐదారేళ్ళు పైగా పనిచేశాడు.
అతని తదనంతరం నేను కాపలాదారుడిని కూడా ఏర్పాటుచేయలేక పోయాను.
1968 నుండి వరుసగా మూడు పర్యాయాలు స్థానిక మున్సిపల్ చైర్మన్‌గా, అనంతరం
శాసనమండలి సభ్యునిగా (1980-84) సుదీర్ఘ రాజకీయ అనుభవం గల
నాకు మెహెర్‌స్థాన్‌కు ఒక వాచ్‌మెన్ నియమించడం పెద్ద విషయం కానే కాదు.
కొందరు ప్రేమికులు మెహెర్‌స్థాన్ ట్రస్టును ఏర్పాటుచేయమని సలహా ఇచ్చారు.
ట్రస్టు ఏర్పాటు వల్ల నా ప్రశ్నలకు జవాబు చిక్కదు. ఎన్ని ట్రస్టులు సక్రమంగా
పనిచేస్తున్నాయి? కాబట్టి - నా సంశయం, నాలోని సంఘర్షణలకు అవతారుడే
త్వరలో జవాబిస్తాడని ఆశిస్తున్నాను.
**అవతారుడి ఆనతి కోసం ఎదురుచూస్తున్నానని శ్రీ కోడూరి ముగించారు.**

***

అవును. సుమారు 50 నిముషాలకు పైగా చెప్పిన కోడూరి గారి మాటల్లో ఆంతర్యం ఎంతో వుంది. అవతారుడు త్వరలో తగిన జవాబు అందిస్తారని ఆశిస్తూ, ఆయన వద్ద శెలవు తీసుకున్నాను. **-మల్లాది కృష్ణానంద్.**

# శ్రీమతి రెంటాల, శ్రీమతి కనకరత్నం

నిజామాబాద్ బాబా సెంటర్ వ్యవస్థాపకులు శ్రీ రెంటాల సూర్యనారాయణ గారి భార్య శ్రీమతి లక్ష్మీ కుమారి (70) 2013 మే 3న బాబానామస్మరణతోఅవతారునిలో లీనమయ్యారు. అలాగే, శ్రీ రెంటాలవారి సోదరి శ్రీమతి కనక రత్నం (82) 2013 ఏప్రిల్ 13న బాబాలో ఐక్యమయ్యారు. వీరి భర్త శ్రీ బి.వి.కె. రావ్ ముంబాయిలో పెరెల్ ప్రాంతంలో బాబా సెంటర్‌ను నెలకొల్పి విశేష సేవలందించారు. మెహెరాబాద్‌కు విచ్చేసే ప్రేమికులందరికీ ఈ దంపతులు చక్కని ఆతిథ్యం ఇచ్చేవారని ప్రతీతి.

# ఆధ్యాత్మిక అవగాహనా తరగతులు

శ్రీకాకుళం సెంటర్ ఆధ్వర్యంలో మే 9 నుండి 12 వరకూ నాలుగు రోజులపాలుటు ఆధ్యాత్మిక అవగాహనా తరగతులు 18 - 35 సంవత్సరాల వయస్సు గల యువతకు నిర్వంచారు. హైదరాబాద్, విజయవాడ, ఏలూరు, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం తదితర జిల్లాల నుండి 60 మంది యువత ఉత్సాహంగా ఈ తరగతులకు హాజరయ్యారు. బాబా ప్రేమికురాలు శ్రీమతి వి. సుబ్బలక్ష్మి ఈ కార్యక్రమాల సంధానకర్తగా వ్యవహరించారని శ్రీకాకుళం సెంటర్ కార్యదర్శి శ్రీ రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు శ్రీ బి. రామకృష్ణయ్య, శ్రీ యస్.వి. ప్రసాదరాజు, శ్రీ తోట నాగేశ్వరరావు, శ్రీ డి. శ్రీనివాసరావు, శ్రీ ఆర్. బాణేశ్వరరావు, శ్రీ ఎ.వి.జి. హరిప్రసాద్, శ్రీ డి. శ్రీనివాసరావు, తదితరులు పలు అంశాలపై ప్రసంగించారు. **మెహెర్‌ప్రభు చరితం** మొదటి నాలుగు సంపుటాలలో యువతకు క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సాహంగా పాల్గొన్న యువత ప్రశ్నలకు తగిన సమాధానాలు పెద్దలు అందించారని, రాబోయే రోజుల్లో ఇటువంటి శిక్షణా తరగతులను మెహెర్‌స్థాన్ కొవ్వూరులో నిర్వహించాలని శ్రీ ప్రసాద్ రాజు ప్రతిపాదించినట్లు తెలిపారు.

## వివాహము

శ్రీమతి మేరెడ్డి జయశ్రీ మెహెరా, శ్యాం ప్రసాద్ రెడ్డి గార్ల కుమారుడు డా. వితిన్ చంద్ర మెహెర్ వివాహం డా. స్వాతి మెహెరాతో 29.05.2013 బుధవారం 9.30 నిముషాలకు పెద్దబావి మల్లారెడ్డి హాలు, బండంగపేట, (బాలాపూర్ చౌరాస్తా సమీపంలో) జరుపుతున్నట్లు ఆహ్వానం పంపినారు. బాబా ప్రేమికులందరూ తప్పక హాజరుకావాలని వారు (99638-18751, 99638-19074) కోరారు.

శ్రీమతి అంబేకర్ రాజమణి, గోపాల్ గార్ల కుమార్తె చి॥ల॥సౌ॥ భానుశ్రీ వివాహం చి॥ సంతోష్ కుమార్‌తో 18.05.2013 శనివారము ఉ॥ 10.46 ని॥లకు వరలక్ష్మి గార్డెన్స్, బ్యాంక్ కాలనీ, ఆరెపల్లి రోడ్డు, కరీంనగర్‌లో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపినారు.

# మెహెరాబాద్ అభివృద్ధికై

మెహెరాబాద్ అభివృద్ధికై బాబా ట్రస్టుకు విరాళాలు అందజేయవల్సిందిగా ట్రస్టు చైర్మన్ భావూ కల్చురీ ఒక ప్రకటనలో కోరారు. డొనేషన్లు ఆన్‌లైన్ బ్యాంకు అక్కౌంటు -Bank of Maharashtra, M.G. Road Br. Ahmednagar (M.S) SB Account No. 20098450037, IFSC code MAHB0000024 ద్వారా ఆన్‌లైన్‌లో పంపవల్సిందిగా కోరుతున్నారు.

## పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

## మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు బాబా కొంగును చిట్టచివరి వరకు దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యత్వం

**2012 ఏప్రిల్ – మే నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | మే | కె.యం. రావ్, హైదరాబాద్ | రూ. 1000.00 |
| 2. | మే | కె. సుశీల, విశాఖపట్నం | రూ. 1000.00 |
| 3. | మే | కె. వి. అప్పారావు, విజయనగరం | రూ. 1000.00 |
| 4. | మే | కె. సుధాకర్, విశాఖపట్నం | రూ. 1000.00 |
| 5. | మే | డి. రంగబాబు, గుంటూరు | రూ. 1000.00 |
| 6. | మే | చిన్నా ఎన్.వి.వి.నరసింహారావు, ఏలూరు | రూ. 1000.00 |
| 7. | మే | డి. బ్రహ్మానందం, జొన్నాడ | రూ. 1000.00 |
| 8. | మే | ఇ. వెంకట్, కొవ్వూరు | రూ. 1000.00 |
| 9. | మే | కోడూరి శివరామ ప్రసాద్, కొవ్వూరు | రూ. 1000.00 |
| 10. | మే | కె. షణ్ముఖరావు, నరసన్నపేట్ | రూ. 1000.00 |
| 11. | మే | ఎన్. కిషోర్‌బాబు, కర్నూలు | రూ. 1000.00 |
| 12. | మే | పి.ఎస్.ఆర్. బోసు, రాజమండ్రి | రూ. 1000.00 |
| 13. | మే | పి. స్వామి నాయుడు, విశాఖపట్నం | రూ. 500.00 |
| 14. | మే | డి. కిషోర్, ఖమ్మం | రూ. 500.00 |
| | | **మొత్తం** | **రూ. 13000.00** |

❋ ఏప్రిల్ మెహెర్‌బాబా మాసపత్రికలోని జీవిత సభ్యత్వ పట్టికలో టి. గణేశ్వర్, నారాయణపురం గారి పేరును టి. జ్ఞానేశ్వర్ అని తప్పుగా ప్రచురించడమైనది గమనించగలరు.

జీవిత సభ్యత్వం రూ. 1000/–. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

**మా అడ్రస్: ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్–500 087. ఫోన్: 99595–53218, email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/ 789/2012-2014, **Dt.19-12-2011**